



# రాచనగరికి రాదారి

## తుదిదశకు చేరిన కృష్ణానది వారధి

### 3 కిలోమీటర్ల మేర అద్భుత నిర్మాణం

- ఫిబ్రవరికి పూర్తయ్యే అవకాశం 10లో
- కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు
- ప్యాకేజీ-4లో పశ్చిమ బైపాస్‌కు అనుసంధానం
- విజయవాడ నుంచి రాజధానికి దగ్గరగా..



● గౌరవ వందనం

మచిలీపట్నంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. ఎస్పీ ఆర్.గంగాధరరావు పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. 8లో

## కేంద్ర పురస్కారానికి ముప్పాళ్ల ఎంపిక

- 11న ఢిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా పురస్కారం
- రూ.కోటి నిధులు కూడా.. : సర్పంచ్ వీరమ్మ

8లో

# వారిపైనే గురి..!

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ నాయకులపై ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసులో మరో 12 మందిని సీఐడీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో మొత్తం 71 మందిపై కేసు నమోదు చేయగా, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ 71వ నిందితుడు. కాగా, అడ్డగోలు అక్రమాలపై మాజీమంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై ఏసీబీ కేసులు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.



2023 ఫిబ్రవరిలో గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు



## గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో మరో 12 మంది అరెస్టు

- మొత్తం 71 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు
- 71వ నిందితుడిగా సూత్రధారి వల్లభనేని వంశీ
- ఇప్పటికే రిమాండ్‌లో 15 మంది నిందితులు
- విడతలవారీగా అరెస్టులు చేస్తున్న సీఐడీ

**(విజయవాడ/గన్నవరం-ఆంధ్రజ్యోతి)** : 2023, ఫిబ్రవరి 20న గన్నవరంలో వైసీపీ రౌడీమూకలు రెచ్చిపోయాయి. టీడీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని ధ్వంసంచేసి, ఆ పార్టీ నాయకుల కార్లను దహనం చేశారు. ఈ మొత్తం విధ్వంసం అప్పటి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ నేతృత్వంలో సాగింది. ఆయన ప్రధాన అనుచరులు ఓలుపల్లి మోహనరంగా, భీమవరపు యతేంద్ర రామకృష్ణ, కాట్రు శేషుకుమార్, ముల్పూరి ప్రభుకాంత్ కర్రలు పట్టుకుని హంగామా సృష్టించారు. అయితే, అప్పట్లో వైసీపీ నాయకులపై కేసులు పెట్టేందుకు పోలీసులు సాహించలేకపోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎట్టకేలకు ఈ ఘటనపై కేసు నమోదైంది. ఈ విధ్వంసంలో 71 మందిని నిందితులుగా గుర్తించి ఎఫ్ఐఆర్ 137/2023 నమోదు చేశారు. ఈ ఏడాది జూలైలో 15 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తాజాగా మరో 12 మందిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో కొలుసు కిరణ్ (తెంపల్లి), తిరుమలశెట్టి రాజేశ్ (బొమ్ములూరు), మద్దాల అజయ్ (తిప్పనగుంట), ఆర్నేపల్లి రవివర్మ (కోడూరుపాడు), జార్జి (హనుమాన్ నగర్, బాపులపాడు), గండికోట నాగరాజు (రాజీవ్‌నగర్, బుద్ధవరం), మట్టా అనీల్ (తిప్పనగుంట), గంజి కాంతారావు (సున్న), సొంగా నరేంద్ర (ఆత్కూరు), రాజా (వంశీ పీఏ), కడవకొల్లు రామ్మోహన్ (గన్నవరం), దరువేముల పవన్ కుమార్ (తిప్పనగుంట) ఉన్నారు. వీరిని విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరు పరచగా, ఈనెల 20 వరకు రిమాండ్ విధించారు. అనంతరం గాంధీనగర్‌లోని జిల్లా జైలుకు తరలించారు.

### కీలక పాత్రధారుల సంగతేంటి?

కేసులో కీలక పాత్రధారులైన అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ఆయన ముఖ్య అనుచరులు.. ఓలుపల్లి మోహనరంగా రావు అలియాస్ రంగా, బి.యతేంద్ర రామకృష్ణ అలియాస్ రాము, కాట్రు శేషుకుమార్ అలియాస్ శేషు, గన్నవరం ఎంపీపీ అనగాని రవి, నక్కా గాంధీ, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, నన్నపనేని చలపతి, వంశీ పీఏ గద్దె సుధీర్ తదితరులను పోలీసులు అరెస్టు చేయలేదు. వీరిలో కొందరు న్యాయస్థానం ద్వారా ముందస్తు బెయిల్ తెచ్చుకోగా, మరికొందరు పరారీలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు.

## నాని, వంశీలకు బిగుస్తున్న ఉచ్చు




మాజీమంత్రి కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. వైసీపీ హయాంలో చెలరేగిపోయి అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన వీరిపై, వీరి అనుచరులపై పోలీసులు ఇప్పటికే వేట మొదలుపెట్టారు. గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల కేంద్రంగా ఈ ఇద్దరు వైసీపీ నేతలు చేసిన దందాలు, దౌర్జన్యాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ విభాగం విచారణ నిర్వహించి నివేదికలను ప్రభుత్వానికి అందించింది. వీటి ఆధారంగా ఏసీబీ అధికారులు ఒకటి రెండు రోజుల్లో కొడాలి నాని, వల్లభనేని వంశీపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. వైసీపీ హయాంలో ఈ ఇద్దరు నేతలు చెలరేగిపోయారు. స్థానిక టీడీపీ నేతలపై దాడులు చేయించడం, టీడీపీ అధినేత, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులపై నోరుపారేసుకోవడం వంటివి చేశారు. కొడాలి నాని గుడివాడలో ఏకంగా కేసినో కల్చర్‌కు శ్రీకారం చుట్టారు. ఇదేమిటని ప్రశ్నించేందుకు వెళ్లిన టీడీపీ నేతలపై దాడులు చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కార్యాలయంపై పెట్రోలు బాటిళ్లు విసిరారు. మరోవైపు కొడాలి నాని అనుచరులు విచ్చలవిడి దందాలకు తెరలేపారు. వివాదాస్పద భూములను చెరపట్టారు. జగనన్న కాలనీలకు మెరక పేరుతో దోపిడీ చేశారు. గన్నవరంలో కూడా పలు గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేసి వంశీ అనుచరులు పెద్ద ఎత్తున డబ్బు సంపాదించారు. చివరికి ప్రభుత్వ భూములను కూడా వదలకుండా మట్టిని తవ్వి సొమ్ము చేసుకున్నారు. ఇచ్చిన అనుమతుల కంటే ఎక్కువ తవ్వడం, మైనింగ్, రాయల్టీ, సీనరేజ్ ఎగ్గొట్టడం వంటివి చేశారని విజిలెన్స్ విభాగం విచారణలో తేలింది. లీజుకు ఇచ్చిన దానికంటే 4 రెట్లు అదనంగా మట్టి తీశారని, అసలు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఏ పన్ను కూడా చెల్లించలేదని నిర్ధారించారు. విజిలెన్స్ విభాగం గన్నవరం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో జరిగిన మట్టి తవ్వకాలపై కొలతలు తీయడమే కాకుండా ఏ మేరకు తవ్వకాలు జరిగాయో నిర్ధారించి నివేదికను రూపొందించింది. ఈ నివేదికలో వంశీ అనుచరులు ఆయన అండ చూసుకుని అధికారులను బెదిరించి ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని కొల్లగొట్టారని విజిలెన్స్ విభాగం పేర్కొంది. దీనికి సంబంధించిన ఆధారాలను కూడా నివేదికతో జత చేసింది. వంశీ అనుచరులు సుమారు 40 మంది ఈ అక్రమ మట్టి దందాలో రూ.కోట్లు గడించారని విజిలెన్స్ స్పష్టం చేసింది. ఈ నివేదికను ప్రభుత్వం పరిశీలించి.. ఒకటి రెండు రోజుల్లో ఏసీబీ కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడం, బినామీ అకౌంట్లను ఓపెన్ చేసి చేయని పనికి చేసినట్లుగా బిల్లులు సృష్టించి డబ్బు డ్రా చేయడం వంటివి ఏసీబీ పరిధిలోకి వస్తుందని న్యాయనిపుణులు సలహా ఇచ్చినట్లు తెలిసింది. అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల ద్వారా కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని న్యాయనిపుణులు ప్రభుత్వానికి సూచించారు.

# అన్నదానంలో అవినీతి భోజనం

## దుర్గగుడిలో ఓ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం

- అన్నదాన టెండర్లలో ఆయనదే హవా
- ఎల్ 1 ను కాదని తనకే కాంట్రాక్టు ఇవ్వాలని పట్టు
- గతంలో అన్నదానం లెక్కల్లో తారుమారు
- కోర్టు కేసుల పేరుతో అద్దెకు సైతం ఎగనామం



**(విజయవాడ-ఆంధ్రజ్యోతి)** : దుర్గగుడిపై ఆయన చెప్పిందే వేదం. ఆయన మాట వినకుంటే అధికారులు, సిబ్బందిపై తప్పుడు ఫిర్యాదులు చేయిస్తారు. తన మాట కాదని ఎవరైనా టెండర్లు వేస్తే వారిని బెదిరిస్తారు. తాజాగా అన్నదాన విభాగంలో టెండర్లు జరిగాయి. ఎల్1గా వచ్చిన కాంట్రాక్టర్‌ను పక్కన పెట్టేసి, ఎల్2గా వచ్చిన తనకు టెండర్ ఇవ్వాలంటూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. దేవదాయ శాఖ కమిషనరేట్‌లో తన మాటకు తిరుగులేదని, తన దారికి అడ్డు వస్తే ఇబ్బందులు తప్పవని, కాంట్రాక్టు వదిలి వెళ్లిపోవాలని ఎల్1గా వచ్చిన కాంట్రాక్టర్‌ను బెదిరిస్తున్నారు.

### ఆయనో అనకొండ

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన ఉచిత అన్నదాన పథకంలో క్లీనింగ్, సర్వింగ్ కాంట్రాక్టును కొన్నేళ్లుగా ఓ కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడు. అధికారులను ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం ద్వారా ఈయనే ఈ కాంట్రాక్టును దక్కించుకుంటున్నాడు. సుమారు రెండేళ్ల క్రితం ఓ భక్తుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవస్థానం ఉన్నతాధికారులు అంతర్గత విచారణ జరిపించి అన్నదాన విభాగంలో అక్రమాలు జరిగినట్లు నిగ్గుతేల్చారు. దీనికి బాధ్యులను చేస్తూ అన్నదాన విభాగాన్ని పర్యవేక్షించే ఏఈవో అమృతరావు, సూపరింటెండెంట్ హేమ, గుమస్తా ప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అసలు సూత్రధారి అయిన కాంట్రాక్టరుపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కేవలం 2వేల మంది ఉచిత అన్నదాన ప్రసాదాన్ని స్వీకరిస్తుంటే, సదరు కాంట్రాక్టర్ మాత్రం అధికారులను ప్రలోభపెట్టి రికార్డుల్లో రెట్టింపు సంఖ్యలో భోజనాలు చేసినట్లు చూపుతున్నారని విచారణలో నిర్ధారణైంది. అంతేకాదు.. సదరు కాంట్రాక్టర్ తన వద్ద పనిచేసే సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ కట్టకపోవడంతో వారు ఈ విషయాన్ని దుర్గగుడి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అధికారులు వాస్తవమేనని నిర్ధారించి ఆ కాంట్రాక్టరును బ్లాక్‌లిస్టులో పెట్టారు. బ్లాక్‌లిస్టులో పెట్టాక కూడా హైదరాబాద్‌కు చెందిన సంస్థకు బినామీగా అవతారమెత్తిన సదరు కాంట్రాక్టర్ 2022లో మళ్లీ అన్నదానం టెండరును దక్కించుకుని యథేచ్ఛగా నడిపించేశాడు. ఈ ఏడాది నవంబరు 14తో కాంట్రాక్టు గడువు ముగియడంతో దుర్గగుడి అధికారులు మళ్లీ టెండర్ పిలిచారు. ఈ టెండర్లలో ఎల్1గా వీఎల్‌డీ మిగతా 8లో..



పర్యటన ఏర్పాట్లను అధికారులకు వివరిస్తున్న కలెక్టర్ బాలాజీ

## నేడు కానూరుకు సీఎం

● ఊర్జావీర్ ప్రారంభోత్సవానికి రాక

**పెనమలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)** : ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం కానూరులో పర్యటించనున్నారు. ఇక్కడి మురళీ రిసార్ట్స్‌లో ఊర్జావీర్ ప్రారంభోత్సవానికి ఆయన హాజరుకానున్నారు. కాగా, సీఎం పర్యటన ఏర్పాట్లను శుక్రవారం ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.రవి సుభాష్, ఏపీ జెన్కో ఎండీ చక్రధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు పరిశీలించారు. సీఎండీ రవిసుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఊర్జావీర్, అంగన్వాడీ సెంటర్లకు ఇండక్షన్ వంట సామగ్రి పంపిణీ, శక్తి సామర్థ్య ఉపకరణాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్‌తో కలిసి ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# హమ్మయ్య..!

## మచిలీపట్నం జెడ్పీ సెంటర్‌లో ఆక్రమణల తొలగింపు

- వైసీపీ నాయకుల ఆక్రమణలో కొన్నేళ్లుగా చెరువు భూమి
- నెలనెలా లక్ష రూపాయలకుపైగా అద్దెల వసూలు
- ఐదు ఎకరాల ప్రభుత్వ చెరువులో చేపల పట్టుబడి కూడా..
- అక్కడే కాపుసారా విక్రయాలు
- ట్రాఫిక్ సమస్య.. గొడవలతో రోజురోజుకూ బీభత్సం
- ఎట్టకేలకు సమస్య పోయిందంటున్న నగరవాసులు





ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణల తొలగింపు (ఇన్‌సెట్‌లో) ఆక్రమణలు తొలగించిన తర్వాత..

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం** : వైసీపీ నాయకుల ఆక్రమణ చెర నుంచి మచిలీపట్నంలోని రజకుల చెరువుకు మోక్షం లభించింది. మచిలీపట్నం-పెడన రహదారి వెంబడి, మచిలీపట్నానికి ముఖద్వారమైన జెడ్పీ సెంటరులో ఐదెకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును వైసీపీ నాయకులు ఆక్రమించారు. ఈ స్థలంలో చికెన్ షాపులు, మెకానిక్ షెడ్లు, చిన్నపాటి హోటళ్లు, బడ్డీకొట్లను కట్టారు. వీటి వెనుకవైపు చెరువును కొంతమేర పూడ్చి ఇళ్లు నిర్మించారు. ఈ ఆక్రమణల్లోని నిర్మాణాలను మిగతా 8లో..



● వైభవం

మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మార్గశిర మాస షష్టి కల్యాణోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. 8లో

## వాహనాలు సమకూర్చి.. ఇతర జిల్లాలకు ధాన్యం పంపండి

● జిల్లా అధికారులకు సీఎం ఆదేశాలు

**మచిలీపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)** : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, పౌరసరఫరాల కమిషనర్ వీరపాండియన్, ఇతర ఉన్నతాధికారులు శుక్రవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని త్వరగా కొనేందుకు, ఇతర జిల్లాల్లోని మిల్లులకు పంపేందుకు వాహనాలను సమకూర్చాలని ఆదేశాలు జారీచేశారు. తిరుపతి, బాపట్ల, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులను ఎంపికచేసి, అక్కడకు ధాన్యాన్ని పంపాలని సూచించారు. ఇతర జిల్లాల్లో ఎంపిక చేసిన మిల్లులకు కృష్ణాజిల్లాలోని నాలుగైదు మండలాలను కేటయించి ధాన్యం రవాణా చేసేలా అనుమతులు మంజూరు చేయాలని కూడా ఆదేశించారు.



అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ

## అంబేడ్కర్ అడుగుజాడల్లో దేశ ప్రగతికి కృషిచేద్దాం

» ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ

**కృష్ణలంక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో పయనిస్తూ దేశాభివృద్ధికి కృషి చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీలు అన్నారు. బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ లక్ష్మీశ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు మహోన్నతమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జిల్లా, రాష్ట్రం, దేశప్రగతికి మనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మచిలీపట్నం టౌన్ :** భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కృష్ణాజిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో బాలాజీ, ఆర్. గంగాధరరావులు అంబేడ్కర్ చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు.




సీనియర్ హోమ్‌గార్డు, జాతీయ అవార్డు గ్రహీత చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు

## హోమ్‌గార్డుల పాత్ర అభినందనీయం

» ఎస్పీ గంగాధరరావు

**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** హోమ్‌గార్డులు పోలీసులతో సమానంగా విధ్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తున్నారని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన హోమ్‌గార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ గంగాధరరావు పరేడ్‌ను తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల మృతిచెందిన ముగ్గురు హోమ్‌గార్డుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, హోమ్‌గార్డు మిత్రులు తమ తోటివారిని ఆదుకునేందుకు నిధిని సేకరించడం అభినందనీయమన్నారు. రోజుకు రూ.710 వేతనంతో పనిచేస్తున్న హోమ్‌గార్డుల సమస్యలు తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలు పాల్గొన్నారు. సీనియర్ హోమ్‌గార్డు చంద్రశేఖర్ ప్లటూన్ కమాండర్‌గా వ్యవహరించగా చంద్రశేఖర్‌ను ఎస్పీ సత్కరించారు.

### జాతీయ ఉత్తమ విద్యాసంస్థగా విద్యావికాస్




అవార్డు అందుకుంటున్న విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని

**గుడివాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** జాతీయ స్థాయి ఉత్తమ విద్యాసంస్థగా గుడివాడ విద్యావికాస్ మరోసారి నిలిచింది. శుక్రవారం తెలంగాణ రాజధాని హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన బ్రెయిన్ ఫీడ్ ఈటి టెక్ సంస్థ నిర్వహించిన ప్రత్యేక కాన్ఫరెన్స్‌లో ట్రైల్ బ్లేజర్ అవార్డును విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావుకు అందజేశారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ, విద్యారంగంలో ఐదు దశాబ్దాలుగా గుడివాడ పరిసర ప్రాంతాల్లో కామర్స్ అధ్యాపకులు ముప్పాళ్ల సుబ్బారావు(ఎం.ఎస్.ఆర్) సుపరిచితులని, ఆయన ఆధ్వర్యంలో 33 ఏళ్లుగా ఉన్నత విద్యాసంస్థగా విద్యావికాస్ నిలిచిందన్నారు. పాఠశాలకు అత్యంత ప్రతిష్టాత్మకమైన ట్రైల్ బ్లేజర్ అవార్డు దక్కడం గర్వకారణమన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రేరణలతో, నిబద్దత గల ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషితో పాఠశాలకు ఈ అవార్డు దక్కిందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందిని అభినందించారు.

## వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి మహోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మార్గశిరమాస షష్ఠి కళ్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయులు, దేవదాయశాఖ అధికారుల తరపున స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు ఆలయ ప్రధాన అర్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మకు అందజేశారు. అర్చక బృందం వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా పెండ్లి కుమారుడిని అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### రవీంద్రను బలితీసుకుంది తలశిల రఘురామే!

» టీడీపీ నేతల ఆరోపణ

**గొల్లపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** దొంగపత్రాలతో గోల్డ్ స్కీం సృష్టించి కారెంపూడి రవీంద్రను బలి తీసుకుంది వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామేనని టీడీపీ నేతలు ఆరోపించారు. గొల్లపూడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, టీడీపీ నేత కారంపూడి ఆత్మహత్యకు తనకు ఎలాంటి సబంధం లేదని వైసీపీ నేత, ఎమ్మెల్సీ రఘురాం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. వైసీపీ అధికారంలో ఉండగా రఘురాం చేసిన నిర్వాకం అందరికీ తెలుసునన్నారు. రవీంద్ర ఆత్మహత్యకు కారణం రఘురాం అని రవీంద్ర కుమారుడే ఫిర్యాదు చేశాడన్నారు. గొల్లపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్రా వాసు, నూతులపాటి నారద, బొర్రా తిరుపతిరావు పాల్గొన్నారు.

# భూ వివాదాలకు సత్వర పరిష్కారం

» ప్రజల వద్దకు వెళ్లి అర్జీల స్వీకరణ

» రెవెన్యూ సదస్సుల ప్రారంభ కార్యక్రమంలో సిసోడియా

» భూ వివాదాలు లేని గ్రామాలే లక్ష్యం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



లబ్ధిదారుకు పత్రాలు అందజేస్తున్న రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే తాతయ్య

**జగ్గయ్యపేట రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** ప్రజల వద్దకు వెళ్లి భూ వివాదాలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా అన్నారు. శుక్రవారం తక్కెళ్లపాడులో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే ఫిర్యాదుల్లో 40 శాతానికి పైగా భూములకు సంబంధించే వస్తున్నాయన్నారు. సదస్సు వల్ల రికార్డుల్లో మార్పులు, చేర్పులు చేయించుకోవచ్చని చెప్పారు. దీర్ఘకాలం కోర్టు కేసుల్లో ఉన్న భూములకు కూడా పరస్పర అవగాహనకు వస్తే సదస్సులో పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, భూ వివాదాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని తెలిపారు. గ్రామంలో 16 సమస్యలు రాగా వాటిలో భూములు దేవదాయ శాఖలో నమోదైఉన్నాయని, ఆయాశాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం చేసిన పొరబాట్ల వల్ల భూ సమస్యలు పెరిగాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసి రైతులకు భరోసా ఇచ్చిందన్నారు. ముందుగా ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి ముఖ్యమంత్రి చంద్రబాబు సందేశాన్ని చదివి వినిపించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి మహేశ్వరరావు, తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, సర్పంచ్ కస్యుర్తి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఈనాం భూముల సమస్య పరిష్కరించాలి

సుమారు 225 ఏళ్ల క్రితం పాలించిన రాజులు, జమీందార్లు తమ భూములను ఆలయాలలో పని చేసిన సిబ్బందికి వంశపారంపర్యంగా ఈనాం భూములు అందించారని, అప్పటి నుంచి అవి రకరకాలుగా చేతులు మారాయని తెలిపారు. ప్రభుత్వం ఈ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని బాధితులు సిసోడియాకు వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యమంత్రి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమీక్షలు జరిపి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

### మొర్సుమిల్లి గ్రామ సచివాలయంలో..

**మైలవరంరూరల్ :** మండలంలోని మొర్సుమిల్లి గ్రామ సచివాలయంలో శుక్రవారం తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన గ్రామసభలో 50 మంది రైతులు పలు సమస్యలపై విజయవాడ జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు అర్జీలు సమర్పించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వం పారదర్శకత పాటిస్తుందన్నారు. గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి లావణ్యకుమారి, సర్పంచ్ మాదపాటి రమాదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



### కవులూరు గ్రామంలో

**కృష్ణలంక :** జి.కొండూరు మండలంలోని కవులూరు గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సును సీసీఎల్ఏ జి.జయలక్ష్మి పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. సదస్సుల నిర్వహణ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశాలు.. పొలాల్లోకి అధికారులు!

» 24 మంది రైతుల ధాన్యం శాంపిల్స్ సేకరణ

» తేమ శాతం 20కి పైగానే ఉందని వెల్లడి



వల్లూరుపాలెం కృష్ణానది ఒడ్డున ధాన్యం రాశులు

**తోట్లవల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** కరకట్టపై రైతుల ధర్నా, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు శుక్రవారం ఫీల్డుకి వచ్చి ధాన్యం రైతులను కలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు, ఆర్ఎస్‌కె సిబ్బంది వచ్చి 24 మంది రైతులకు చెందిన ధాన్యం శాంపిల్స్ తీసుకుని తేమ శాతాన్ని పరీక్షించారు. అయితే ధాన్యంలో 20కి పైగానే తేమ శాతం ఉన్నట్టు తేలిందని వ్యవసాయాధికారి చెప్పారు. 20లోపు తేమ శాతం ఉండి బస్తాకి కేజీ ధాన్యం కటింగ్‌కి రైతులు ఒప్పుకుంటే మిల్లుకు పంపుతామని, అందుకు రైతులు అంగీకరించలేదన్నారు. తేమ 17 శాతం వస్తే మిల్లులకు పంపుతామన్నారు. రైతులు ఆర్ఎస్‌కె చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి రైతుల ఆందోళన, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో అధికారులు తమ చెంతకు రావటం కొత్త పరిణామమని రైతులు అన్నారు.

కాగా 13 రోజులు, 8 రోజుల నుండి ఆరబెట్టిన ధాన్యం తేమశాతం 20కి పైగా ఉందని అధికారులు చెప్పటాన్ని పలువురు రైతులు బత్తిన నాగమల్లేశ్వరరావు, నత్తా నాగేశ్వరరావు, చింతపల్లి అర్జునరావు ఆక్షేపిస్తున్నారు. ధాన్యం ఎండి గలగల మంటోందని, ఇంకా ఎన్ని రోజులు ఆరబెట్టాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కలెక్టర్ హెచ్చరికలతో దళారులు కూడా దూరంగా ఉండిపోయారు.

### వల్లూరుపాలెం వీఏఏ ఆయేషాపై వేటు!

**తోట్లవల్లూరు:** వల్లూరుపాలెం ఆర్ఎస్‌కెలో పనిచేస్తున్న వీఏఏ ఆయేషాను శుక్రవారం కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయాధికారి జి.నాగేశ్వరరావు తెలిపారు. ధాన్యం రైతుల సమస్యలపై గురువారం రాత్రి వల్లూరుపాలెం వచ్చిన కలెక్టర్ రైతులకు జరిగిన నష్టాలను తెలుసుకున్నారు. 339 బస్తాల ధాన్యం మిల్లుకు తీసుకెళితే 281 బస్తాల ధాన్యానికే బిల్లు ఇచ్చారని రైతు నాగసతీష్ కొండవీటి ఆంజనేయులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ధర్నా చేయటంతో కోత వేసిన ధాన్యానికి బిల్లు పంపారని ఆధారాలను కలెక్టర్‌కు సమర్పించారు. దాంతో ఆర్ఎస్‌కెలో ధాన్యం ట్రక్కు షీట్ జనరేట్ చేయకపోవటాన్ని తప్పుబట్టి వీఏఏ ఆయేషాను సస్పెండ్ చేశారు.

## జనని శిశు సురక్షలో 14.5 లక్షల గర్భిణులకు చికిత్స

» ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం



**వన్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** జనని, శిశు సురక్ష కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చేకూరిన లబ్ధిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్ సమావేశాల్లో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభలో లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్లలో 14,05,394 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించినట్టు ఆమె తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద జననీ, శిశు సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, 2023-2024 ఆర్థిక సంవత్సరానికి తల్లి ఆరోగ్య సేవల కోసం రూ.81.74కోట్లు విడుదల చేయగా, రూ.65.79 కోట్లు వినియోగించారని చెప్పారు. శిశు ఆరోగ్య సంరక్షణ కోసం రూ.3.78 కోట్లు విడుదల చేయగా, రూ.3.75కోట్లు వినియోగించారని తెలిపారు. మొత్తంగా 2019-2020 నుంచి 2023-24 వరకు ఈ పథకం కింద 14,05,394 మంది గర్భిణులకు వైద్య సేవలు అందించారన్నారు. ఇదే క్రమంలో 2,04,142 మంది శిశువులకు వైద్య సేవలు అందినట్టు తెలిపారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికిగాను ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ప్రకారం ఈ పథకంలో తల్లీబిడ్డల సంరక్షణ కోసం రూ.29.09 కోట్లు విడుదల చేయగా, రూ.20.53కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

## పీఎం సూర్యఘర్‌లో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

» పథకం లబ్ధికి రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**కృష్ణలంక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (సౌర విద్యుత్) పథకం అమల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు విద్యుత్ శాఖ అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై కలెక్టర్ లక్ష్మీశ, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పథకం కింద ఎలాంటి ముందస్తు పెట్టుబడి లేకుండా రూ.2 లక్షల విలువైన కేడబ్ల్యు సోలార్ ప్యానెల్‌ను రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాయితీ మినహా మిగిలిన రూ.1,02,000ను తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందొచ్చన్నారు. ఇంటి పైకప్పు సోలార్ ప్యానెల్ ప్రాజెక్ట్ జీవితకాలం 25 ఏళ్లు వుంటుందని, మొత్తం మీద రూ.8,27,369 ఆదా అవుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, జిల్లాలో వచ్చే మార్చి నాటికి 20 వేల వరకు రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని, అదేవిధంగా 2027 మార్చి నాటికి లక్ష ఇన్‌స్టలేషన్ల లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా ప్రభుత్వ ఉద్యోగులు తొలుత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కుటుంబానికి ఆర్థిక ఆసరాతో పాటు పర్యావరణానికి మేలు చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ మురళీమోహన్, డీఈ (టెక్) హనుమయ్య, నోడల్ అధికారి భాస్కర్, ఏపీసీపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడిగా కృపానందం ఎన్నిక



కృపానందంను అభినందిస్తున్న ఏపీఎన్జీవో నేతలు

**గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడిగా పురుషోత్తపట్నం గ్రంథాలయ అధికారి కొలకలూరి కృపానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం విజయవాడ ఎన్జీవో హోమ్‌లో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పర్యవేక్షణలో గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల చినరాజు, అసోసియేషన్ అధ్యక్షుడిగా కూనపరెడ్డి వెంకట సుబ్రమణ్యేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా సాలార్ షరీఫ్, సహాయ కార్యదర్శి ధారావత్ నాగేశ్వరరావు, కోశాధికారిగా షేక్ రఫీ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి.రాంబాబు, పరిశీలకులుగా రాష్ట్ర జేఏసీ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ హరినాథ్ వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. గ్రంథాలయ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అన్నదానంలో అవినీతి భోజనం!

(5వ పేజీ తరువాయి)

ఏజెన్సీ నిలిచింది. ఎల్2గా గతంలో కాంట్రాక్టు దక్కించుకున్న వ్యక్తి వచ్చాడు. ఎలాగైనా టెండరు దక్కించుకోవాలన్న ఉద్దేశంతో ఎల్1గా వచ్చిన కాంట్రాక్టరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో పాటు సదరు కాంట్రాక్టరును బెదిరిస్తున్నాడు.

### దుకాణాల్లో పాగా

దుర్గగుడి దత్త ఆలయం సీతానగరంలోని శ్రీమద్ వీరాంజనేయస్వామి ఆలయానికి సామారంగం చౌక్ రోడ్డులో దుకాణాల సముదాయం ఉంది. ఈ దుకాణాల్లోని ఒకదాంట్లో అన్నదాన కాంట్రాక్టర్ లైటింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. ఈ దుకాణానికి సుమారు ఏడాదిగా అద్దె చెల్లించకపోవడంతో సుమారు రూ.5 లక్షల పైచిలుకు బకాయి ఉండిపోయింది. దీంతో ఈ దుకాణానికి వేలం నిర్వహించేందుకు దుర్గగుడి అధికారులు సిద్ధం కాగా, అన్నదాన కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాడు. దుర్గగుడిలోని కొందరు సిబ్బంది సలహాతోనే ఈయన కోర్టు మెట్లెక్కినట్టు తెలిసింది.

## ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**మైలవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం సీఎస్‌సీ చదువుతున్న మరుపు సాయిలక్ష్మి శుక్రవారం సాయంత్రం తాను ఉంటున్న హాస్టల్ భవనం నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. విజయనగరం జిల్లా పేర్లం మండలం లోచర్ల గ్రామానికి చెందిన ఆమెకు ఆరోగ్యం బాగోటం లేదని చదువుకోలేకపోతున్నానని పేరెంట్స్‌కు తెలిస్తే బాధపడతారనే ఉద్దేశంతో కిందకు దూకినట్టు తెలిపిందని ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని మెరుగైన వైద్యం కోసం గొల్లపూడిలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

## కేంద్ర పురస్కారానికి ముప్పాళ్ల ఎంపిక



**చందర్లపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్‌కు ముప్పాళ్ల గ్రామం ఎంపికైంది. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇచ్చే ఈ అరుదైన పురస్కారం దక్కడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమౌతుంది. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ మొత్తం ఏడు అంశాల ప్రాతిపదికగా రాష్ట్రంలో నాలుగు పంచాయతీలను ఎంపిక చేసింది. సామాజిక న్యాయం, సామాజిక భద్రత అంశాల్లో ముందంజలో ఉన్న ముప్పాళ్ల పంచాయతీని పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 11న ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి గ్రామ సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ, కార్యదర్శి సాయిరామ్‌లు పురస్కారం అందుకోనున్నారు. పురస్కారంతో పాటు గ్రామాభివృద్ధికి రూ.కోటి నిధులు అందజేయనున్నారు. దీనిపై సర్పంచ్ వీరమ్మ, కార్యదర్శి సాయిరామ్‌లు మాట్లాడుతూ, ఇంతటి మహోన్నతమైన పురస్కారం దక్కడం ఎంతో గర్వంగా ఉందన్నారు. గ్రామానికి కేంద్ర పురస్కారం దక్కడం పట్ల ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట వీరబాబు, మండల అధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసిరెడ్డి ప్రసాద్, నల్లాని రవిబాబు, నల్లాని ప్రభాకర్, నల్లాని శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## హమ్మయ్య..!

(5వ పేజీ తరువాయి)

శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా.. ఆ స్థలం తమదని చూపి, తమదైనశైలిలో నెలనెలా అద్దె వసూలు చేస్తున్న వైసీపీ నాయకుల అక్రమాలకు బ్రేక్ వేశారు.

### నెలకు రూ.లక్షకుపైగా వసూలు

వైసీపీ హయాంలో ఆ పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్, ఆయన సోదరులు జెడ్పీ సెంటరులో 5.40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రజకుల చెరువును ఆక్రమించారు. జెడ్పీ సెంటరులో ఉన్న చెరువును తొలుత ఐదారుమీటర్ల మేర పూడ్చి షాపులు ఏర్పాటుచేశారు. అద్దెలకు ఇచ్చారు. కొంతకాలం తరువాత ఈ షాపుల వెనుక ఉన్న చెరువును మరో ఏడెనిమిది మీటర్ల పొడవున పూడ్చారు. అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా చిన్నపాటి ఇళ్లు నిర్మించి అద్దెలకిచ్చారు. వీటిద్వారా నెలకు రూ.లక్ష వరకు వసూలువుతోంది. ఈ ఆక్రమణలను తొలగించేందుకు గతంలోనే మున్సిపల్ అధికారులు ప్రయత్నించారు. కానీ, అప్పటి వైసీపీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని సదరు కార్పొరేటర్ అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో అప్పట్లో ఆక్రమణలు తొలగించకుండా అధికారులు మిన్నకుండిపోయారు. ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఈ చెరువులో చేపలు సాగుచేస్తున్న ఈ కార్పొరేటర్ ఏటా చేపల పట్టుబడి కూడా చేస్తున్నాడు.

### కాపుసారా విక్రయాలకు అడ్డా

జెడ్పీసెంటరులో ఆక్రమించిన స్థలాల్లో వివిధ షాపులను ఏర్పాటు చేయడంతో అక్కడకు వచ్చినవారు తమ వాహనాలను ప్రధాన రహదారిపై పెడుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. మచిలీపట్నం-పెడన రహదారి వెంబడి వచ్చే వాహనాలు, ఈసెంటరు సమీపంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో ఉన్న రైస్‌మిల్లులకు ధాన్యం లోడుతో వచ్చే వాహనాల రాకపోకలకు అడ్డంకి ఏర్పడుతోంది. ఈ షాపుల వద్ద కార్పొరేటర్ సోదరుడు ఒకరు కాపుసారా విక్రయాలు కూడా సాగిస్తున్నాడు. కాపుసారా తాగినవారు ఆ ప్రాంతంలో వీరంగం సృష్టిస్తున్నారు. ఈ ఆక్రమణ తొలగింపుతో ఈ ప్రాంతంలో గొడవలు తగ్గుతాయని స్థానికులు చెప్పుకొంటున్నారు. చెరువు ప్రాంతాన్ని సుందరీకరించేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

### లక్ష్మీటాకీస్ సెంటరులో ఆక్రమణలు?

లక్ష్మీటాకీస్ సెంటరులో ఉన్న ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి, ప్రధాన రహదారికి మధ్యలో ఉన్న జాగాను వైసీపీకి చెందిన కార్పొరేటర్ ఒకరు ఆక్రమించి షాపులు ఏర్పాటు చేశాడు. ఈ షాపుల నుంచి ఆ కార్పొరేటర్ నెలనెలా అద్దె వసూలు చేసుకుంటున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ సెంటరులోని ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి ఆక్రమిత షాపులను కూడా తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు.

## కేసీపీలో క్రషింగ్ ప్రారంభం



కర్మాగారంలో పూజలు చేస్తున్న సీతారామదాస్

**ఉయ్యూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** కేసీపీ చక్కెర కర్మాగారంలో ప్రస్తుత సీజన్‌కు చెరకు క్రషింగ్‌ను శుక్రవారం యూనిట్ హెడ్ వై.సీతారామదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది 3లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయడం జరుగుతుందని అంచనా అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు తట్టుకునే సామర్థ్యం చెరకు పంట సాగుచేసి లబ్ధి పొందాలన్నారు. రైతు ప్రయోజనాల కోసం కేసీపీ యాజమాన్యం కట్టుబడి ఉందన్నారు. రైతు నాయకులు ఎస్‌వీ కృష్ణారావు, రత్నగిరిరావు, తిమ్మారెడ్డి, కేసీపీ కేన్ జీఎం పున్నారావు, డీజీఎం వెంకటేశ్వర్లు, చంద్రబాబు, వసంతరావు, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జగన్ ఆస్తిలో సగం షర్మిలకు దక్కాలి : యార్లగడ్డ

**హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** స్వర్గీయ ఎన్టీఆర్ తెచ్చిన హిందూ వివాహ చట్టం ప్రకారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన ఆస్తిలో సగ భాగం తన సోదరి షర్మిలకు ఇచ్చి చట్టాన్ని గౌరవించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. శుక్రవారం బాపులపాడులో ఆయన మాట్లాడుతూ, 1985 తర్వాత వివాహమైన ఆడపిల్లలకు ఈ చట్టం వర్తిస్తుందని నాడు ఎన్టీఆర్ ప్రకటించడం జరిగిందన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ హిందూ వివాహ చట్ట సంప్రదాయాన్ని అందరూ గౌరవించాలన్నారు.

### రైతులను మోసం చేసిన పీఏసీఎస్ సెక్రటరీ అరెస్టు

**రెడ్డిగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** శ్రీరాంపురం పీఏసీఎస్‌లో రైతుల నుంచి వసూళ్లు చేసిన రూ.37 లక్షలను బ్యాంకులో జమ చేయకుండా మోసం చేసిన కేసులో నిందితుడు పీఏసీఎస్ కార్యదర్శి వడిమే ప్రభుదాసును శుక్రవారం పోలీసులు మైలవరంలో అరెస్టు చేశారు. రిమాండ్ నిమిత్తం మైలవరం కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ బి.మోహన్‌రావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్ | 184 |
| చికెన్ స్కిన్‌లెస్ | 194 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

## రాజుపేటలో అల్లూరి విగ్రహావిష్కరణ రేపు

**ఉయ్యూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** కాటూరు గ్రామ పంచాయతీ పరిధి రాజుపేటలో ఆదివారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమం పెద్దయెత్తున నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు రామలింగరాజు, అప్పలరాజు, కుటుంబరాజు, త్యాణరాజు, శ్యామలాదేవి తెలిపారు. రాజుపేటలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, విగ్రహావిష్కరణ కార్యాక్రమానికి కేంద్ర సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్రమంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, వర్లకుమార్ రాజా, రత్నాగ్రూప్ ఛైర్మన్ వెంకటేశ్వర్లురాజు, పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్టు తెలిపారు.



సభ్యత్వ నమోదులో పార్టీ నాయకులు

## యనమలకుదురులో టీడీపీ సభ్యత్వ నమోదు

**పెనమలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** యనమలకుదురులోని రామలింగేశ్వరస్వామి కొండ వెనుక సాయిబాబా ఆలయం వద్ద శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కొత్త సభ్యత్వాలతో పాటు పాత సభ్యత్వాల రెన్యువల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్, శౌంతి శివరాంప్రసాద్, కుటుంబరావు, కొండ, సుబ్బు, ఉమామహేశ్వరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బెంచీలు బహూకరణ

**హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** బాపులపాడు శ్రీశైల మల్లికార్జునస్వామి దేవస్థానానికి విజయవాడకు చెందిన వైఎన్నార్ చారిటబుల్ ట్రస్ట్ చెర్మన్ యలమంచిలి జయప్రకాష్ రూ.40వేలు విలువ చేసే సిమెంట్ బెంచీలను బహూకరించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా తెలిపారు. శుక్రవారం దేవస్థానం ప్రహరీ నిర్మాణానికి చిన్నా విజయకుమారి దంపతులు భూమిపూజ నిర్వహించారు.

## బకాయిలు చెల్లించాలి

**గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్ బాధిత కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు శుక్రవారానికి 10వ రోజుకు చేరాయి. అక్కడే వంటావార్పు నిర్వహించారు. తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు, సతీష్‌లు మాట్లాడుతూ, తమకు కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకం ఉందన్నారు. న్యాయం జరిగే వరకూ దీక్షలు విరమిం చేది లేదని చెప్పారు. బాబు, తులసీ, నాగూర్ బాషా, దాసు, మోహన్, లక్ష్మీ ప్రసన్న, తేజ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



గండిగుంటలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

## సీసీ రోడ్డు ప్రారంభం

**ఉయ్యూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** గండిగుంట పంచాయతీ పరిధి ధరణి, విభ అపార్ట్‌మెంట్లు వద్ద రూ. 34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పీటీఎం విజయవంతం చేయాలి

**గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా ప్రవేశపెట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీవో టి.స్వర్ణలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వర్ణలత మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో పీటీఎం జరగాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమష్టిగా విజయ వంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎంఈవోలు కొండా రవికుమార్, కమల పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

బాపులపాడు రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



బాపులపాడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పాల్గొన్న ఇతర అధికారులు

**హనుమాన్‌జంక్షన్ / ప్రసాదంపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, గత వైసీపీ ప్రభుత్వం హయాంలో అడ్డగోలుగా భూముల రికార్డులు తారుమారు చేసి అన్యాక్రాంతం చేయడానికి పాల్పడిన రెవెన్యూ అధికారులకు శిక్ష తప్పదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరించారు. శుక్రవారం బాపులపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. తొలుత బీ.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. అభివృద్ధిని గత ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కొంత కాలంగా రెవెన్యూ రికార్డులు తారుమారాయ్యాయని ఇందుకు కారణమైన తహసీల్దార్లపై చర్యలు తప్పవన్నారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో 15వేల మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానని వాగ్దానం చేశాను. సీఎం చంద్రబాబు విజన్ చూసాక భరోసా ఏర్పడిందన్నారు. సదస్సులో ప్రత్యేకాధికారి జిల్లా పంచాయతీ అధికారిణి అరుణ, తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, కూటమి నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, చలమలశెట్టి రమేష్‌బాబు, వేమపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి సాయికల్యాణి, దయాల రాజేశ్వరరావు, వీరమాచనేని సత్యప్రసాద్, వడ్డిల్లి లక్ష్మీ, ఆట్లూరి శ్రీనివాసరావు, వడ్డి శివనాగేశ్వరరావు,గ్రామ ఉపసర్పంచ్ దుట్టా శివన్నారాయణ, పంచాయితీ కార్యదర్శి పూర్ణేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రతి ఒక్కరూ భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలో రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. తొలుత బీ.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా డీపీవో జె.అరుణ, విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ సుగుణ, బాపులపాడు తహసీల్దార్ నాగభూషణం, ఎంపీడీవో విగ్గిన్స్ పాల్గొన్నారు.

**బల్లిపర్రులో..**

**గన్నవరం :** భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వి.సుజాత అన్నారు. మండలంలోని బల్లిపర్రులో రెవెన్యూ గ్రామసభ శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ, రైతులు తమ భూసమస్యలను అర్జీల రూపంలో ఇస్తే పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. తహసీల్దార్ కెవి శివయ్య మాట్లాడుతూ, సెక్షన్ 22ఏ తొలగించాలని రెండు అర్జీలు, పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 13 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు జొన్నలగడ్డ రంగమ్మ, వీఆర్వోలు గోపాలరావు, రమ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.



బల్లిపర్రులో అర్జీలు స్వీకరిస్తున్న స్పెషలాఫీసర్ సుజాత, తహసీల్దార్ శివయ్య

**పెదఅవుటపల్లిలో..**

**ఉంగుటూరు :** భూ వివాదాలను పరిష్కరించి, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పెదఅవుటపల్లిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మున్నా రామకృష్ణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జాలాది విమలకుమారి, టీడీపీ నాయకులు కుందేటి చంద్రశేఖర్, ఆళ్ల హనోక్, కొండేటి వెంకటేశ్వరరావు, కొండేటి ఏడుకొండలరావు, గొట్టుముక్కల కృష్ణారావు, యార్లగడ్డ విజయ్ బాబు, ఆర్‌ఐ సూర్యకాంతి, వీఆర్వో శివయ్య, పంచాయతీ కార్యదర్శి యోహాన్ తదితరులు పాల్గొన్నారు.



పెదఅవుటపల్లి సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ విమలకుమారి

## నాణ్యమైన ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు స్థాపించాలి



పరిశ్రమల స్థాపనపై యువతకు సూచనలు చేస్తున్న ఏపీఎంఎస్ఎంఈ ఈడీ సురేంద్రబాబు

**ఉంగుటూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** నాణ్యమైన ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలను ఎక్కువ సంఖ్యలో నెలకొల్పడం ద్వారా రైతులకు అండగా నిలబడేందుకు ఔత్సాహిక యువపారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఏపీఎంఎస్ఎంఈ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఎలీప్ ఇండియా సీఈడీ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్రిక్లినిక్, అగ్రిబిజినెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శుక్రవారం ముగిసింది. సిద్ధార్థ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ, తొలుత చిన్న కుటీర పరిశ్రమలుగా ప్రారంభించి అంచెలంచెలుగా ఎదు గుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులందరికీ అతిథుల చేతులమీదుగా సర్టిఫికెట్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఈడీ పరదేశి, శోభారాణి, మైనేని నళిని పాల్గొన్నారు.

## జాతీయస్థాయి యోగాసన పోటీలకు పీవీపీ సిద్ధార్థ కళాశాల విద్యార్థుల ఎంపిక



యోగాసన విజేతలతో ప్రిన్సిపాల్ శివాజీబాబు

**పెనమలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** జేఎన్టీయూకే కాకినాడలో ఈనెల 3, 4వతేదీలలో జరిగిన యోగాసన సెలక్షన్లలో పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. కళాశాలకు చెందిన వసుంధర రెండవ స్థానాన్ని, ఈశ్వరి, దుర్గా జగదీష్‌లు మూడవ స్థానాన్ని సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె శివాజీబాబు తెలిపారు. విజేతలను యాజమాన్యం అభినందించింది.

## సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్

**ఉయ్యూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** పేదవారికి సైతం మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న ఆరుగురికి రూ. 20,42,634 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న వారిని ఆర్థికంగా ఆదుకోవడమే ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు లక్ష్యమన్నారు. ఉయ్యూరు మాజీ చైర్మన్ ఖుద్దూస్, కౌన్సిలర్లు పల్యాల శ్రీనివాస్, పరిమి సలోమిసంతోషి, పార్టీ నాయకులు రాజుల పాటి ఫణి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామావసరాలకు దగ్గరలో భూమి ఇవ్వాలి

అధికారుల తీరుపై మల్లవల్లి గ్రామస్థుల ఆగ్రహం



మల్లవల్లిలో భూమిని గ్రామస్తులకు చూపిస్తున్న అధికారులు

**హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** గ్రామావస రాలకు గ్రామానికి దగ్గరగా ఉన్న భూమిని కేటాయించకుండా సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలోని గోతిలో ఉన్న భూమిని చూపిస్తున్నారని మల్లవల్లి గ్రామస్థులు అలూరి సురేష్, అక్కినేని కృష్ణాజీ, యనమదల వెంకయ్యారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లవల్లి గ్రామానికి అనుకుని ఉన్న భూమిలో పనులు చేస్తుండగా గురువారం గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు శుక్రవారం గ్రామస్తులతో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, ఆర్డీఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనివార్య కారణాల వల్ల జోనల్ మేనేజర్, ఆర్డీఓ సమావేశానికి గైర్హాజరవడంతో గ్రామా వసరాలకు కేటాయించే భూమిని తహసీల్దార్ నాగభూషణం ప్రజలకు క్షేత్రస్థాయిలో చూపించారు. నరసింహస్వామి ఆలయానికి ప్రక్కనే ఉన్న సుమారు 7అడుగుల గోతిలో ఉన్న భూమిని చూసిన గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఆవేదనను ఫోన్‌ద్వారా ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ నాగభూషణంకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య వెంకటేశ్వరావు, రాట్నాలరాజు, తిరుపతిరావు, రామకృష్ణ, చంద్రరావు, జమలయ్య, గోపి తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



గన్నవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఘన నివాళి.. కంకిపాడులో.. ఉయ్యూరులో.. హనుమాన్ జంక్షన్‌లో..

# అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



తాడిగడపలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఇతర నాయకులు

**పెనమలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** దేశంలోని బడుగు బలహీన వర్గాల ప్రజానీకానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తాడిగడపలోని విగ్రహానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కానూరులోని అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, రత్నకుమారి, ప్రభావతి, మురళి, కాట్రగడ్డ ప్రసాద్, మాదు శోభన్, ఇమాం పాల్గొన్నారు.

**కంకిపాడు :** అంబేద్కర్ వర్ధంతి పురస్కరించుకుని కంకిపాడు లాక్‌రోడ్డులో శుక్రవారం ఆయన విగ్రహానికి సర్పంచ్ బాకీబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ చిరంజీవి, వెంకటేశ్వ రరావు, బాకీ రాజు, శివ పాల్గొని నివాళులర్పించారు.

**ఉయ్యూరు :** అంబేద్కర్ వర్ధంతి పురస్క రించుకుని మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద ఎంపీడీవో శేషగిరిరావు, ఏవో లోయ శివశంకర్, ఈఓ పీఆర్డీ కోటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

**గన్నవరం :** అంబేద్కర్ ఆదర్శనీయులని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు.

**హనుమాన్‌జంక్షన్ :** బాపులపాడులో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, వీరమాచనేని సత్యప్రసాద్, ఆట్లూరి శ్రీనివాసరావు, రాజేశ్వరరావు డి.జయప్రకాష్, కల్యాణ్, నివాళులర్పించారు.

**విజయవాడ రూరల్ :** నున్నలోని బొడపాడులో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపీటీసీ బొంతు సరోజిని, నున్న గ్రామ ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డిలు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు మాజీ ఎంపీపీ వై. నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ కర్రి విజయ్‌కుమార్, దండు సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన ప్రేమ జంట వ్యవహారం

పోలీసుల తీరుపై యువకుడి బంధువుల ఆందోళన

**హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** ప్రేమ జంట వ్యవహారంలో జంక్షన్ పోలీసులు అత్యుత్సాహం చూపించి యువతిని వారి తల్లి దండ్రులకు అప్పగించి నందుకు నిరసనగా యువకుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం రాత్రి రహదారిపై ఆందోళన చేశారు. బాపులపాడు మండలం కె.సీతారాంపురం గ్రామానికి చెందిన యువతీ, రేమల్లి గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించుకున్నారు. ఇద్దరిది ఒకే సామాజిక వర్గం అయినా యువతి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రేమ వ్యవహారాన్ని వ్యతిరే కించారు. దీంతో ప్రేమ జంట ఇరువురు కలిసి రెండు రోజుల కిందట ఊరు విడిచి వెళ్లారు. యువతి తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడంలేదని ఈ నెల 5న జంక్షన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానిపై మిస్సింగ్ కేసు నమోదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసుల్ని ఆశ్రయించారు. అక్కడ నుంచి సమాచారం రావడంతో ఇరువుర్ని జంక్షన్ పీఎస్‌కు తీసుకొచ్చి ఎస్సై సురేష్ కౌన్సిలింగ్ నిర్వహించారు. యువతికి నచ్చ చెప్పి తీసుకురావాలని తల్లిదండ్రులతో కారులో పంపిస్తున్న తరుణంలో యువకుడు కారుకు అడ్డంపడి మా ఇద్దరికి వివాహం జరిపించాలని ఆందోళనకు దిగాడు. అతని కుటుంబ సభ్యులు, బంధువులు కూడా రహదారిపై పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డు మీద బైఠాయించి ఆందోళనకు చేశారు.. దాదాపు గంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. ఆందోళనకు దిగిన యువకుడు అస్వస్థతకు గురికావంతో ఆసుపత్రికి తరలించారు. జంక్షన్‌కు చెందిన పలువురు గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని పది రోజులు సమయం ఇవ్వాలని యువతి తల్లి దండ్రులతో మాట్లాడి పెళ్లి జరిపించడానికి ప్రయత్నిస్తామని హామీ ఇవ్వడంతో యువకుడి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

## ధాన్యం కొనుగోలుపై అపోహలొద్దు

సాయిపురం రైతులతో కలెక్టర్ డీకే బాలాజీ



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

**ఉయ్యూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు అపోహలొద్దని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. సాయిపురంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామ సభకు వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతు సహాయ కేంద్రంలో తేమశాతం కంటే మిల్లర్ల వద్ద తేమశాతం ఎక్కువగా వస్తుందని, 1262 రకం ధాన్యం మిల్లర్లు తీసుకోవడం లేదని సాయిపురం సర్పంచ్ జాన్‌బాషా, జబర్లపూడి సర్పంచ్ సూరపనేని ప్రసాద్‌తో పాటు పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో 22 శాతం తేమవరకు మిల్లర్లు తీసుకుంటారని, అదేవిధంగా 1262 రకం ధాన్యం కూడా తీసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించిందని, ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉన్న నేపథ్యంలో ధాన్యం ఆరబెట్టి మిల్లులకు తీసుకు వెళ్లాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఏవిధమైన ఇబ్బంది కలుగకుండా చూడాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఉద్యోగులకు సూచించారు.

## నాణ్యమైన పాల ఉత్పత్తికి కృషి చేయాలి



జంక్షన్ పాలశీతల కేంద్రం కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తున్న చలసాని

**హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) :** నాణ్యమైన పాల ఉత్పత్తి దిశగా క్షేత్రస్థాయిలో సొసైటీ అధ్యక్షులు కృషి చేయాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక పాలశీతల కేంద్రం కార్యాలయంలో జంక్షన్ క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదా రుల సహకార సంఘాలకు 2024- 25 ఆర్థిక సంవత్సరం సంబంధించి రూ.1.63 కోట్లు బోనస్ చెక్కులను చలసాని పంపిణీ చేశారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటం వద్ద ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మాగంటి హరిబాబు, సంఘ అధ్యక్షులు కొల్లి వెంకట్రావు, పిన్నమనేని లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను ఆదరించటం అభినందనీయం

**గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** దివ్యాంగులను ఆదరించటం అభినందనీయమని మండల న్యాయాధికారి జయలక్ష్మీ అన్నారు. మండలంలోని దావాజీగూడెం స్పందన మానసిక వికాస కేంద్రంలో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన లాంటి సంస్థ స్థాపించి ఉచితంగా సేవలు చేయటం గొప్ప విషయమన్నారు. సమాజానికి ఇలాంటి సంస్థలు ఎంతో అవసరమన్నారు. దివ్యాంగులకు విద్యా, వైద్యం, రవాణా, భోజనం అందించటం మంచి పరిణామమన్నారు. పెద అవుటపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సుజాత, స్పందన మానసిక వికాస కేంద్రం సెక్రటరీ ఎస్.రజిత, పారాలీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# రాచనగరికి రాదారి





**తుదిదశకు చేరిన కృష్ణానది వారధి**

- 3 కిలోమీటర్ల మేర అద్భుత నిర్మాణం
- ఫిబ్రవరి నాటికి పూర్తయ్యే అవకాశం
- కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు
- ప్యాకేజీ-4లో పశ్చిమ బైపాస్‌కు అనుసంధానం
- విజయవాడ నుంచి రాజధానికి దగ్గరగా..

92 శాతం పనులు పూర్తయిన కృష్ణానది వారధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

కృష్ణానదిపై ఆరు వరసల వంతెన పనులు తుదిదశకు చేరాయి. ప్రస్తుతం గొల్లపూడివైపు పనులు జరుగుతుండగా, 92 శాతం పనులు పూర్తయినట్టే. అన్ని పనులను ఫిబ్రవరికి పూర్తిచేసే అవకాశం ఉంది. రెండు వరసలుగా ఉండే ఈ బ్రిడ్జిలో మూడు లేన్ల చొప్పున మొత్తం ఆరు లేన్లు ఉంటాయి. గొల్లపూడి దిగువన సూరాయపాలెం నుంచి కృష్ణానది మీదుగా మూడు కిలోమీటర్ల పొడవున ఈ వంతెన నిర్మాణం జరిగింది. వంతెన పూర్తయినా.. అందుబాటులోకి రావటానికి మరికొంతకాలం పట్టే అవకాశం ఉంది. దీనికి అనుబంధంగా కాజ వరకు రోడ్డు పనులు అనుకున్నంత వేగంగా జరగకపోవడమే ఇందుకు కారణం.

### కాజ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టులో అంతర్భాగం

ప్రతిష్ఠాత్మక కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు పరిధిలోకి ఈ కృష్ణా బ్రిడ్జి వస్తుంది. ఈ రోడ్డును నాలుగు ప్యాకేజీలుగా చేపడుతున్నారు. ఈ వంతెన నాల్గో ప్యాకేజీ పరిధిలోనిది. కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టు కోసం రెండు దశాబ్దాల కిందట కేంద్ర ప్రభుత్వం బీవోటీ పద్ధతిలో టెండర్లు పిలిచింది. అప్పట్లో టెండర్లు దక్కించుకున్న గామన్ ఇండియా ఆర్థిక సమస్యలతో పనులు ప్రారంభించలేదు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టుకు ఈపీసీ విధానంలో కేంద్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. గుండుగొలను నుంచి కలపర్రు వరకు ప్యాకేజీ-1, కలపర్రు నుంచి చిన్న అవుటపల్లి వరకు ప్యాకేజీ-2, చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3, గొల్లపూడి నుంచి కాజ వరకు ప్యాకేజీ-4గా విభజించి పనులు చేపట్టారు. ప్యాకేజీ-4 పనులను నవయుగ-అదానీ జాయింట్ వెంచర్‌గా దక్కించుకుంది. కృష్ణా బ్రిడ్జితో పాటు అమరావతి మీదుగా కాజ వరకు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించింది.

## 2025లో సాధారణ సెలవులు 23

▸ 21 ఐచ్ఛిక సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది (2025) సాధారణ, ఐచ్ఛిక సెలవుల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. పండుగలు, జాతీయ సెలవులు కలిపి ప్రభుత్వ కార్యాలయాలకు మొత్తం 23 రోజులు సాధారణ సెలవులు, మరో 21 రోజులు ఐచ్ఛిక సెలవులుగా ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 30న ఉగాది సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ సెలవుల్లో రిపబ్లిక్ డే, ఉగాది, శ్రీరామనవమి, మొహర్రం పండుగలు ఆదివారం వచ్చాయని తెలిపింది. రంజాన్, బక్రీద్, మొహర్రం, ఈద్ మిలాద్-ఉన్-నబీతో పాటు చంద్రుడి రాకతో సంబంధం ఉన్న హిందూ పండుగలను అప్పటి పరిస్థితులను బట్టి ప్రకటిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**సాధారణ సెలవులు**

| పండుగ | తేదీ | వారం |
|---|---|---|
| భోగి | 13/01/25 | సోమ |
| సంక్రాంతి | 14/01/25 | మంగళ |
| కనుమ | 15/01/25 | బుధ |
| రిపబ్లిక్ డే | 26/01/25 | ఆది |
| మహాశివరాత్రి | 26/02/25 | బుధ |
| హోళీ | 14/03/25 | శుక్ర |
| ఉగాది | 30/03/25 | ఆది |
| ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) | 31/03/25 | సోమ |
| బాబు జగ్జీవన్‌రామ్ జయంతి | 05/04/25 | శని |
| శ్రీరామనవమి | 06/04/25 | ఆది |
| అంబేడ్కర్ జయంతి | 14/04/25 | సోమ |
| గుడ్ ఫ్రైడే | 18/04/25 | శుక్ర |
| ఈద్ ఉల్ అజా (బక్రీద్) | 07/06/25 | శని |
| మొహర్రం | 06/07/25 | ఆది |
| వరలక్ష్మీ వ్రతం | 08/08/25 | శుక్ర |
| స్వాతంత్ర్య దినం | 15/08/25 | శుక్ర |
| శ్రీకృష్ణాష్టమి | 16/08/25 | శని |
| వినాయక చవితి | 27/08/25 | బుధ |
| మిలాదున్ నబీ | 05/09/25 | శుక్ర |
| దుర్గాష్టమి | 30/09/25 | మంగళ |
| గాంధీ జయంతి/ విజయదశమి | 02/10/25 | గురు |
| దీపావళి | 20/10/25 | సోమ |
| క్రిస్మస్ | 25/12/25 | గురు |

**ఐచ్ఛిక సెలవులు**

| పండుగ | తేదీ | వారం |
|---|---|---|
| నూతన సంవత్సరం | 01/01/25 | బుధ |
| హజ్రత్ అలీ జయంతి | 13/01/25 | సోమ |
| షబ్-ఇ-మీరజ్ | 27/01/25 | సోమ |
| షబ్-ఇ-బరాత్ | 14/02/25 | శుక్ర |
| షహదత్ హజ్రత్ అలీ | 22/03/25 | శని |
| షబ్-ఈ-కదర్ | 27/03/25 | గురు |
| జమాతుల్ వాద | 28/03/25 | శుక్ర |
| మహావీర్ జయంతి | 10/04/25 | గురు |
| బసవ జయంతి | 30/04/25 | బుధ |
| బుద్ధ పూర్ణిమ | 12/05/25 | సోమ |
| ఈద్-ఇ-గదీర్ | 15/06/25 | ఆది |
| రథయాత్ర | 27/06/25 | శుక్ర |
| మొహర్రం | 05/07/25 | శని |
| పార్శీల నూతన సంవత్సరాది | 15/08/25 | శుక్ర |
| మహాలయ అమావాస్య | 21/09/25 | ఆది |
| యాజ్ దహుమ్ షరీఫ్ | 09/10/25 | గురు |
| కార్తీక పౌర్ణమి/ గురునానక్ జయంతి | 05/11/25 | బుధ |
| హజ్రత్ సయ్యద్ మహమ్మద్ జువన్‌పురి మెహదీ జయంతి | 06/11/25 | గురు |
| క్రిస్మస్ ఈవ్ | 24/12/25 | బుధ |
| బాక్సింగ్ డే | 26/12/25 | శుక్ర |

## పరువేలేని వ్యక్తి పరువు నష్టం దావా వేస్తాడా?

▸ విజయసాయిరెడ్డి ఓ చచ్చిన పాము: బుద్దా వెంకన్న

హైదరాబాద్, అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబుకు కులపిచ్చి ఉందంటూ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలపై టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం, ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మాట్లాడారు. 'విజయసాయిపై క్రిమినల్ కేసు పెడతాం. జైలుకు పంపించేంతవరకూ వదలిపెట్టబోం. ఆయన వ్యాఖ్యలపై విజయవాడ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా. పరువే లేని వ్యక్తి పరువు నష్టం దావా వేస్తాడట. ఆయనో చచ్చిన పాము. వైసీపీ టైటానిక్ షిప్ అని, ఎన్ని లంగర్లు వేసినా అది లేవబోదు' అని బుద్దా వెంకన్న విమర్శించారు.

### విజయసాయిపై చర్యలు తీసుకోవాలి: బ్రహ్మం చౌదరి

వైసీపీ బ్రోకర్ విజయసాయిరెడ్డిపై హోంశాఖ సుమోటోగా కేసు ఫైల్ చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బ్రహ్మం చౌదరి ఒక ప్రకటనలో కోరారు.

## ముంపు పరిహారం పంపిణీలో అవకతవకలు

▸ టీడీపీ గ్రీవెన్స్‌లో పులిచింతల నిర్వాసితుల ఫిర్యాదు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముంపు బాధితుల పరిహార పంపిణీలో అవకతవకలు జరిగాయని గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం ఎమ్మాజీ గూడేనికి చెందిన పులిచింతల నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. 45 మంది అక్రమార్కులకు అధికారులు అప్పనంగా డబ్బులు కట్టబెట్టారని, దీనిపై విచారణ జరిపిచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్తంగా పలువురు బాధితులు శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయాన్ని ఆశ్రయించారు. మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ వారినుంచి వినతులు స్వీకరించారు. శుక్రవారం నుంచి గ్రామాల్లోనే రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయని, భూ సమస్యలను అక్కడే పరిష్కరించుకోవాలని బాధితులకు సూచించారు.

## వన్నెకుల క్షత్రియ అభివృద్ధికి కృషి

▸ చైర్మన్‌గా సీఆర్ రాజన్ బాధ్యతలు



మాట్లాడుతున్న సీఆర్ రాజన్

ఆటోనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ వన్నెకుల క్షత్రియ అభివృద్ధికి కృషి చేస్తానని, ఆంధ్రప్రదేశ్ వన్నెకుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సీఆర్ రాజన్ అన్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆటోనగర్‌లోని ఎగ్జిబిషన్ సొసైటీ హాలులో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియులు ఎన్నో ఏళ్లుగా వెనుకబడిపోయారని, వారి అభ్యున్నతికి పాటుపడతానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజన్‌కు మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణ శుభాకాంక్షలు తెలిపారు. గురజాల ఎమ్మెల్యే జగన్‌మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పాల్గొన్నారు.

## అలరించిన గాత్రకచేరీ

**విజయవాడ కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** చెన్నైకి చెందిన కస్తూరి కమల దీప్తి గాత్ర కచేరీ ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141వ జయంతి ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో స్వరఝరి సంస్థ, గాయక సార్వభౌమ సంగీత పరిషత్ సంస్థల ఆధ్వర్యంలో గాత్ర కచేరీ నిర్వహించారు.

# మహిళల రక్షణ సామాజిక బాధ్యత

▸ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు




మహిళలపై హింసకు వ్యతిరేకంగా 'ఉమెన్స్ ఈక్వాలిటీ 1కే వాక్'ను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**కృష్ణలంక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** మహిళలను కాపాడుకోవడం సామాజిక బాధ్యత అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహితలో మహిళలపై హింసను నివారించేందుకు కఠినమైన చట్టాలు రూపొందించారన్నారు. అంతర్జాతీయ దినోత్సవం, మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మహిళలపై హింస నిర్మూలనం కోసం బందరురోడ్డులోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వద్ద శుక్రవారం నిర్వహించిన 'ఉమెన్స్ ఈక్వాలిటీ 1కే వాక్'ను ఆయన ప్రారంభించారు. మహిళల రక్షణ కోసం జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు కళాశాల ప్రాంగణాల్లో మహిళల భద్రతకు, హింసను నివారించేందుకు చట్టపరంగా ఉన్న అవకాశాలను వివరిస్తూ అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్, జి.నారాయణరావు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్నాం

▸ విజయవాడ జీజీహెచ్‌లో మంత్రి నిమ్మల.. 24వ సారి మంత్రి రక్తదానం



రక్తదానం చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 101వ రక్తదాన శిబిరంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. 24వ సారి రక్తదానం చేశారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. దేశంలో మొదటిసారిగా దళితులైన జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభాభారతిని శాసన సభ స్పీకర్‌గా చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో సమర్థవంతంగా అమలైన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను వైసీపీ దారి మళ్లించిందని, ఎస్సీలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఓ దళిత వ్యక్తిని చంపి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీకి మాజీ సీఎం జగన్‌రెడ్డి సన్మానం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### జస్టిస్ పీఎల్ఎన్ శర్మకు
## హైకోర్టు ఘన నివాళి

**అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జస్టిస్ పీఎల్ఎన్ శర్మకు హైకోర్టు ఘన నివాళి అర్పించింది. ఇటీవల మరణించిన జస్టిస్ పీఎల్ఎన్ శర్మకు నివాళి అర్పించేందుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలో ఇతర న్యాయమూర్తులు శుక్రవారం మొదటి కోర్టు హాలులో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం.. జస్టిస్ పీఎల్ఎన్ శర్మ సేవలను గుర్తుచేసుకున్నారు. డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, ప్రభుత్వ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రూ.25వేలు పోయినా..రూ.51వేలు పదిలం

డిజిటల్ అరెస్టు నుంచి తప్పించుకున్న సీనియర్ సిటిజన్

**విజయవాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** యువతితో అసభ్యకరంగా ప్రవర్తించిన వీడియోలు ఉన్నాయని సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి తొలుత రూ.25 వేలు పంపినా, తర్వాత బ్యాంక్ అధికారులు, సైబర్ క్రైం పోలీసుల అండతో రూ.51వేలు పంపకుండా డిజిటల్ అరెస్టు నుంచి తప్పించుకోగలిగిన ఓ సీనియర్ సిటిజన్ ఉదంతమిది. వివరాల్లోకి వెళితే..ఎల్ఐసీ కాలనీకి చెందిన ఓ సీనియర్ సిటిజన్‌కు గవర్నరుపేట బ్యాంక్ ఆఫ్ బరోడాలో అకౌంట్ ఉంది. ఆయన పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. బ్యాంక్ అకౌంట్‌లో ఆయన డబ్బులు పొదుపు చేసుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి గుర్తుతెలియని నంబరు నుంచి ఆయనకు వాట్సాప్ కాల్ వచ్చింది. తాము యూట్యూబ్ చానల్ నుంచి మాట్లాడుతున్నామని, నీ అసభ్యకర చిత్రాలు మా వద్ద ఉన్నాయని, వాటిని మా చానల్‌లో అప్‌లోడ్ చేస్తామని సీనియర్ సిటిజన్‌ను వారు బెదిరించారు. తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పినా అవతలి వ్యక్తులు బెదిరిస్తూనే ఉన్నారు. తాము చెప్పిన అకౌంట్ నంబరుకు రూ.25వేలు పంపాలని హుకుం జారీ చేశారు. తన పరువు, ప్రతిష్ఠలకు భంగం కలుగుతుందని భయపడిన ఆయన ఆగమేఘాల మీద బ్యాంక్ ఆఫ్ బరోడాకు వెళ్లారు. వారు చెప్పిన మొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా అకౌంట్‌కు బదిలీ చేశారు. తర్వాత కాసేపటికి పోలీసులమంటూ మరో వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. తాను పోలీసు ఆఫీసర్‌నని, ఆ ఫొటోలను డిలీట్ చేయిస్తానని చెప్పి రూ.51వేలు పంపమని అకౌంట్ నంబరు ఇచ్చాడు. తర్వాత ఈ డబ్బులను పంపడానికి ఆర్టీజీఎస్ ఫాం పూర్తి చేశారు. బ్యాంక్ సిబ్బందికి అనుమానం వచ్చి ఇటీవల పోలీసు అధికారులు ఇచ్చిన ప్రశ్నావళిని ఆయనకు ఇచ్చారు. వెంటనే బ్యాంక్ సిబ్బంది సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ గుణరాము, ఎస్ఐ మూర్తికి సమాచారం ఇచ్చారు. వారు బ్యాంకుకు వెళ్లి సీనియర్ సిటిజన్‌తో సైబర్ నేరగాళ్లతో మాట్లాడించారు. వారు చెప్పిన రూ.51వేలు పంపినట్టుగా ఒక డూప్లికేట్ రశీదును సృష్టించారు. దాన్ని సైబర్ నేరగాళ్లకు వాట్సాప్ ద్వారా పంపారు. సైబర్ నేరగాళ్లు సీనియర్ సిటిజన్‌ను ఆన్‌లైన్‌లో ఉంచి అకౌంట్‌లో నిల్వను చూసుకున్నారు. నిల్వ పెరగకపోవడంతో డబ్బులు రాలేదని చాలాసేపు సీనియర్ సిటిజన్‌తో వాదనకు దిగారు. తర్వాత కాసేపటికి మొత్తం విషయం అర్థమై ఫోన్‌కాల్‌ను కట్ చేశారు. డిజిటల్ అరెస్టులో ఇరుక్కున్న సీనియర్ సిటిజన్ రూ.25వేలను భయంతో పోగొట్టుకున్నాడు. బ్యాంక్ సిబ్బంది, సైబర్ పోలీసులు రంగప్రవేశం చేయడంతో రూ.51వేలను ఖాతాలో పదిలంగా ఉంచుకున్నాడు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టాభి

## 3, 4, 5 తేదీల్లో ట్రేడ్ ఎక్స్‌పో

**ధర్నాచౌక్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు జనవరి 3, 4, 5 తేదీల్లో నగరంలోని వెన్యూ కన్వెన్షన్‌లో స్మైలీ అసోసియేట్స్ ఆధ్వర్యంలో ట్రేడ్ ఎక్స్‌పో-2025ను నిర్వహిస్తున్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి తెలిపారు. ఎక్స్‌పో బ్రోచర్‌ను గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, బిల్డింగ్ వర్కర్స్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గడ్డం రవికుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పట్టాభి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన పాలసీలు తెచ్చి పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు చేయూతనిస్తోందన్నారు. యువ పారిశ్రామికవేత్తలను కూటమి ప్రభుత్వం పోత్సహిస్తుందని, వారి ఎదుగుదలకు తోడ్పాటునందిస్తుందని డూండీ రాకేశ్, రఘురామరాజు పేర్కొన్నారు.

### ఉపాధ్యాయుడి హత్యపై ప్రభుత్వం
## స్పందించకపోవడం శోచనీయం

▸ ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తేవాలి

▸ నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

**ధర్నాచౌక్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** రెండు రోజుల క్రితం కడప జిల్లా రాయచోటిలో పాఠశాల గదిలోనే ఉపాధ్యాయుడిని విద్యార్థులు హత్య చేసిన ఘటనపై ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం శోచనీయమని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో ఇటువంటి విపరీత ధోరణులకు డ్రగ్స్, గంజాయి కారణమని, విద్యార్థుల మానసిక స్థితిపై తక్షణమే అధ్యయనం చేయాలని వారు పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టంలో సవరణలకు కమిటీ ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. డ్రగ్స్, గంజాయి పాఠశాలలకు అత్యంత సమీపంలోనే విక్రయిస్తున్నా ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆరోపించారు. విద్యార్థుల్లో నేర ప్రవృత్తి, చెడు అలవాట్లు, డ్రగ్స్ లభ్యతపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

# రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తులు

**కృష్ణలంక, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** విజయవాడ సర్కిల్(1-3) ఇబ్రహీంపట్నం, మైలవరం, జి.కొండూరు మండలాలు, విజయవాడ అర్బన్‌లో చౌకధరల దుకాణాల డీలర్ల నియామకానికి ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు పంపాలని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య ఓ ప్రకటనలో సూచించారు. దరఖాస్తును నిర్దేశ నమూనా ఫాంలో ఆర్డీవో, విజయవాడకు రిజిస్టర్ పోస్టులో పంపాలని సూచించారు. దరఖాస్తు దాఖలు చేసిన తేదీ నాటికి 18 ఏళ్లకు పైబడి, 40 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణ అవసరమన్నారు. రాతపరీక్ష(80 మార్కులు), మౌఖిక పరీక్ష(20 మార్కులు) ద్వారా ఎంపిక ఉంటుందని తెలిపారు. ఖాళీల వివరాలు, కొత్తగా ఏర్పడిన చౌక దుకాణాలు, కేటగిరీల వారీగా ఖాళీలు తదితర పూర్తి వివరాలు నోటిఫికేషన్‌లో ఉన్నాయని వెల్లడించారు.



కేంద్ర సహాయ మంత్రి సురేష్‌గోపీకి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దుర్గగుడి అధికారులు, అర్చకులు

## కనకదుర్గమ్మను దర్శించుకున్న సురేష్ గోపి

**వన్‌టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** కేంద్ర పెట్రోలియం, సహజవాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి శుక్రవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయమర్యాదల అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

## పోలీసుశాఖకు వెన్నెముక హోంగార్డు వ్యవస్థ



పోలీసులకు పురస్కారాలు అందిస్తున్న సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు

**గుణదల, డిసెంబరు 6(ఆన్‌లైన్):** పోలీసుశాఖకు హోంగార్డు వ్యవస్థ వెన్నెముక వంటిదని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అన్నారు. హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకను మహాత్మాగాంధీ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీ విచ్చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో 998 మంది హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారని సీపీ తెలిపారు. కొవిడ్, వరదలు విపత్తుల సమయంలోనూ హోంగార్డులు చేసిన సేవలు అభినందనీయమన్నారు. హోంగార్డు కమాండ్ టి.ఆనంద్‌బాబు, డీసీపీ కె.వి.ఎస్.ఎన్.పరమేశ్వరరావు, హోంగార్డ్స్ ఆర్ఐ సుధాకర్, డీసీపీలు గౌతమిషాలి, ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్.వి.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

## మహా కుంభమేళా యాత్ర

▸ ఐఆర్‌సీటీసీ సరికొత్త టూర్ ప్యాకేజీ విడుదల

▸ జనవరి 19న ప్రారంభం

▸ వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌ల సందర్శన

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** మహాకుంభమేళాను పురస్కరించుకుని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) సరికొత్త టూర్ ప్యాకేజీకి శ్రీకారం చుట్టింది. కుంభమేళాను వీక్షించటంతో పాటు పవిత్ర పుణ్యక్షేత్రాలను సందర్శించుకునేలా 'మహా కుంభ్ పుణ్య క్షేత్ర యాత్ర - 2025 ' పేరుతో ఏడు రాత్రులు, 8 పగళ్లు సాగేలా టూర్ ప్యాకేజీకి శ్రీకారం చుట్టింది. వారణాసిలో కాశీ విశ్వనాథఆలయం, కాశీ విశాలక్షి, అన్నపూర్ణాదేవి ఆలయాల సందర్శనతో పాటు సాయంత్రం గంగా హారతిని వీక్షించాక అయోధ్య తీసుకెళతారు. సరయు నది దగ్గర ఉన్న రామజన్మభూమి ప్రాంతం, హనుమాన్ గర్హి, ఆరతిలను సందర్శిస్తారు. చివరిగా ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం దగ్గర జరిగే కుంభమేళా వీక్షణ, పవిత్ర స్నానాలు ఆచరించాక తిరుగు ప్రయాణం ఉంటుంది. యాత్ర ప్యాకేజీ సికింద్రాబాద్ నుంచి ప్రారంభమవుతున్నా ప్రత్యేక రైలు విజయవాడ వస్తుంది. విజయవాడ నుంచి బుక్ చేసుకున్న వాళ్లంతా ఇక్కడి నుంచే బయలుదేరవచ్చు. ప్రత్యేక రైలు జనవరి 19న విజయవాడ వస్తుంది. యాత్ర జనవరి 25 వరకు కొనసాగుతుంది.

**టూర్ ప్యాకేజీ టారిఫ్**

టూర్ ప్యాకేజీ ఎకానమీ, స్టాండర్డ్, కంఫర్ట్ కేటగిరీలుగా ఉంటుంది. ఎకానమీలో స్లీపర్ క్లాస్ ఉంటుంది. పెద్దలకు రూ.22,635, పిల్లలకు రూ.21,740. నాన్ ఏసీ రూములు, నాన్ ఏసీ వాహన సదుపాయం ఉంటుంది. స్టాండర్డ్ కేటగిరీలో 3 ఏసీ, పెద్దలకు రూ. 31,145, పిల్లలకు రూ. 30,095. ఏసీ రూములు, నాన్ ఏసీ వాహన సదుపాయం ఉంటుంది. కంఫర్ట్ క్యాటగిరీలో 2 ఏసీ, రూ.38,195, పిల్లలకు రూ.36,935. ఏసీ రూములు, ఏసీ వాహన సదుపాయం కల్పిస్తారు.

### ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాం. సహాయం చేయటానికి మా మేనేజర్లు ఉంటారు. ప్రయాణ బీమా, ఎస్కార్ట్ సేవలు అదనం. యాత్రికులకు ఉదయం టీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనాలు పూర్తి శాఖాహారం అందిస్తాం. 92814 95860, 92814 95848, 89773 14121కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. **- ఎం రాజా, మేనేజర్, ఐఆర్‌సీటీసీ**

## సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టుల దాడి

**చర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):** వరుస ఎన్‌కౌంటర్లలో సహచరులను కోల్పోతూ తీవ్ర ఆగ్రహంతో ఉన్న మావోయిస్టులు.. ప్రతి చర్యగా శుక్రవారం రాత్రి ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ పామేడు సమీపంలోని జీడిపల్లి సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై దాడి చేశారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ నాయకుడు మాద్వి హిడ్మా ఆధ్వర్యంలో జరిగినట్లుగా భావిస్తున్న ఈ దాడి దాదాపు ఆరు గంటల పాటు సాగింది. వందల మంది మావోయిస్టులు పాల్గొన్నట్లుగా తెలుస్తోంది. జీడిపల్లి గ్రామంలో సీఆర్‌పీఎఫ్-228కి చెందిన రెండు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. మొదటిది పూర్తయింది. నిర్మాణంలో ఉన్న రెండో క్యాంప్‌పై గురువారం అర్ధరాత్రి మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. టేజర్ గైడెడ్ బాంబులైన బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లను (బీజీఎల్స్) వినియోగించారు. దీంతో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. వీరి పరిస్థితి నిలకడగా ఉంది. ప్రతిగా బలగాలు ప్యారా బాంబులు వేశాయి. కాగా, కాల్పుల సమయంలో బీజాపూర్ జిల్లా కీలక పోలీస్ అధికారులు క్యాంపుల్లోనే ఉన్నట్లు సమాచారం. మరోవైపు క్యాంప్ నిర్మాణంలో పనిచేస్తున్న కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, సమీప గ్రామస్థులు భయాందోళన చెందారు. సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌లను మావోయిస్టులు వ్యతిరేకిస్తున్నారని, పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలోనే దాడికి పాల్పడ్డారని బలగాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి 16న పామేడు సమీపంలోని ధర్మారం క్యాంప్‌పై వందలమంది దాడికి దిగారు. శుక్రవారం దాడి జరిగిన ప్రదేశం.. జీడిపల్లి క్యాంప్‌నకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. తెలంగాణ సరిహద్దులోని చర్ల మండలానికి ఇవి 8 నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. కాగా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో ఏ క్షణాన్నైనా పోలీసులు, మావోయిస్టుల మధ్య భీకర దాడులు జరిగే ప్రమాదం కనిపిస్తోంది.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్ | 184 |
| చికెన్ స్కిన్‌లెస్ | 194 |

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.620

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ వాసా వెంకటేశ్వరరావు అన్నారు. నోబుల్ కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ని నిర్వహించారు. గంజాయి, మద్యం అనర్థాలపై అవగాహన కల్పించారు. రవాణా చట్టాలను వివరించారు. ప్రిన్సిపాల్ స్టీఫెన్‌సన్ తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లి రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



జింజేరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



గరాలదిబ్బలో అర్జీ ఇస్తున్న జనసేన నేత బండి రామకృష్ణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు

# భూముల సమస్య పరిష్కారమే లక్ష్యం

## రెవెన్యూ సదస్సుల్లో ఎమ్మెల్యేలు, అధికారుల ఉద్ఘాటన

**చల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్‌సి.అనంతకుమార్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, ఎంపీడీవో ఎవి.రమణ, ఏవో జి.సాయి సింధు, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఈవో పివి.మాధవేంద్రరావు, వీఆర్వోలు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల :** భూ సమస్యల శాశ్వత పరిష్కార వేదికగా రెవెన్యూ సదస్సులు నిలుస్తాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పులిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పులిగడ్డ బ్రిడ్జి నిర్మాణ సమయంలో ఇరిగేషన్ స్థలాల్లో గృహాలు నిర్మించుకుని జీవిస్తున్న వారందరికీ స్థలాలు క్రమబద్ధీకరించి పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సొసైటీ భూముల సమస్య పరిష్కరించాలన్నారు.తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.పద్మావతి, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అనిత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సదస్సులో ఆరుగురి నుంచి అర్జీలు వచ్చాయి. **కోడూరు :** రైతుల భూముల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు ఉపయోగించుకోవాలని తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. మాచవరం గ్రామంలో గ్రామసర్పంచ్ అప్పికట్ల లక్ష్మీ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్ కరెక్షన్, భూ సర్వే తదితర సమస్యలపై రైతుల వద్ద నుంచి 32 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, పద్మప్రియ, ఆర్ఐ సుభాషిని, సర్వేయర్లు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **పెడన/ పెడన రూరల్ :** జింజేరు, అచ్చయ్యవారిపాలెం, గౌడపాలెం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వ భూములుగా పేర్కొంటున్నారని జింజేరు గ్రామ ప్రజలు వాపోయారు. సదరు భూముల దస్తావేజులు, పాస్‌పుస్తకాలను ఎమ్మెల్యేకు చూపించారు. సమస్యను పరిష్కరించాలని ఆర్ఐ అనిల్‌కుమార్‌కు ఎమ్మెల్యే కాగిత సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలలో తక్కువ భూమి నమోదైనట్లు 42 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. ఆర్డీవో స్వాతి, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఈవోపీఆర్డీ జయరామ్, డీటీ సల్మా, ఆర్ఐ విజయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేష్ తదితరులు పాల్గొన్నారు. **గూడూరు :** మండల పరిధిలోని ఆకులమన్నాడు, పోసినవారిపాలెం, కప్పలదొడ్డి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ హాజీబేగ్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు ఎండీ రఫీ, పిండి రమాదేవి వెంకన్న, యక్కల మాధవి నాగరాజు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### నిషేధిత 22ఏ జాబితా నుంచి తొలగించాలని అర్జీలు

**నాగాయలంక :** నాగాయలంకలోని రీ సర్వే నెంబర్ 90లోని 1.38 ఎకరాల నివాస గృహాల భూమిని దేవదాయ, ధర్మదాయ శాఖ నిషేధిత జాబితా నుంచి తొలగించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి లకనం నాగాంజనేయులు, గ్రామ ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు, మత్స్యకార సంఘ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ సదస్సులో నోడల్ అధికారి కె.శంకరరావు, తహసీల్దార్ ఎం.హరనాథ్, దేవదాయశాఖ అధికారి ఆంజనేయ స్వామి వినతిపత్రం అందజేశారు. రీ సర్వే నెంబర్ 90లోని భూములకు 2016కు పూర్వం రిజిస్ట్రేషన్ జరిగేవని, 2016 నుంచి దేవదాయశాఖ నిషేధిత జాబితాలో చేర్చిందన్నారు. రీ సర్వే నెంబర్ 90లో అన్నీ నివాస గృహా లేనని, దేవదాయశాఖ భూమి లేదన్నారు. నాగిడి తాతారావు, కొక్కిలిగడ్డ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** నిషేధిత జాబితా నుంచి 22ఏ మా భూములు తొలగించాలని యండకుదురు గ్రామానికి చెందిన రైతులు రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతాంగం 1970 సంవత్సరానికి ముందు నుంచి తమ ఆధీనంలో ఉన్న భూములను ఐదారుసార్లు క్రయ విక్రయాలు జరుపుకుని, ఎవరి స్వాధీనంలో ఉన్న భూమిని వారు సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నామని తెలిపారు. భూములకు పంట కాలువ సదుపాయం లేనప్పటికీ అయినం పూడి డ్రైన్, గుండేరు డ్రెయిన్లపై ఆధారపడి సాగు చేసుకుంటున్నామన్నారు. సుమారు 284 ఎకరాల భూములను 2018 నుంచి నిషేధిత జాబితా 22ఏలో చేర్చారని తెలిపారు. ఆడ పిల్లల వివాహ సమయాల్లో వారికి భూమిని కేటాయించి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నా నిషేధిత జాబితాలో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కావున అధికారులు స్పందించి నిషేధిత జాబితా నుంచి మా భూములను తొలగించాలని అధికారులను కోరారు. ఈ సదస్సులో మొత్తం తొమ్మిది మంది అర్జీలు సమర్పించారు. సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు సిద్ధినేని కుమార్ రాజా, నోడల్ అధికారి ఎస్.వెంకట్రావు పాల్గొన్నారు.

### పట్టాదార్ పాస్‌పుస్తకాలు, అడంగల్ సవరణల పైనే అర్జీలు

**మచిలీపట్నం టౌన్ :** బందరు మండలం గరాలదిబ్బ, గోపువానిపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పట్టాదారు పాసు పుస్తకాలు, అడంగల్‌లో పేరు మార్పు, సరిహద్దు సమస్యల పరిష్కారంపై ఎక్కువగా అర్జీలు వచ్చాయి. గరాలదిబ్బలో తహసీల్దార్ పి.మధుసూదనరావు, డీటీ కల్పనలు అర్జీలు స్వీకరించారు. గరాలదిబ్బలో మొత్తం 13 అర్జీలు వచ్చాయి.. పాస్ పుస్తకాల కోసం నాలుగు, అడంగల్ సవరణకు మూడు, సర్వే చేయాల్సిందగా నాలుగు, పింఛన్ల కోసం ఒక్క దరఖాస్తు ఇచ్చారు. నాగిడి ఏడుకొండలు మూడేళ్ల కుమారుడు నాగిడి జీవన సాయి ఆపరేషన్ చేయించుకున్నాడు. ఎన్టీఆర్ వైద్య సేవలకు బీపీఎల్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, వెంకట నారాయణ, తిరుమలశెట్టి శంకరయ్య, బొడ్డు నాగబాబు, గడ్డం రాజు అర్జీ సమర్పించారు. తహసీల్దార్ మధుసూదనరావు స్పందించి వెంటనే బీపీఎల్ సర్టిఫికెట్ అందజేశారు. గరాలదిబ్బలోని రెవెన్యూ సదస్సును సమగ్ర శిక్ష జిల్లా అధికారి రాములునాయక్ పర్యవేక్షించారు. గోపువానిపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, సర్పంచ్ వాలిశెట్టి చంద్రలేఖ, మండల టీడీపీ అధ్యక్షుడు కుంచే దుర్గాప్రసాద్, క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి సోమశేఖర్ పాల్గొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. జిల్లా చేనేత శాఖ అధికారి పర్యవేక్షించారు.

### ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

**మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** బొబ్బర్లంక గ్రామపరిధిలో కృష్ణానదిలో పులిగడ్డ సరిహద్దు దాటి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని అక్రమ రవాణాను అరికట్టాలంటూ గ్రామసర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, గ్రామస్థులు తహసీల్దార్ ఎం.శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. బొబ్బర్లంక రెవెన్యూ సదస్సులో సర్పంచ్ మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాలకు సంబంధించి కృష్ణానది సరిహద్దు సమస్యపై దీర్ఘకాలంగా పోరాడగా, కొద్దికాలం క్రితమే పరిష్కారమైందన్నారు.

పులిగడ్డ నుంచి అక్రమంగా ఇసుకను తవ్వుతూ మోపిదేవి మండలంలోని బొబ్బర్లంక గ్రామ పరిధిలోకి చొచ్చుకు వస్తున్నారని తెలిపారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్ లింగం బసవ శంకరరావు, గ్రామస్థులు బాల జగన్నాథ నాగేశ్వరరావు, కోనేరు నాగేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి టి.విష్ణు, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, వీఆర్వో కె.వరప్రసాదరావు ఉన్నారు.

### షరతులు లేకుండా అన్ని రకాల ధాన్యం కొనాలి

**మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** రైతులు సాగు చేసిన ధాన్యాన్ని ఏ విధమైన షరతులు విధించకుండా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. పెదప్రోలు, వెంకటాపురం గ్రామాల్లో రహదారి వెంబడి ఆరబోసిన ధాన్యాన్ని బుద్ధప్రసాద్, ఆయన కుమారుడు మండలి వెంకట్రామ్, కూటమి నేతలతో కలసి పరిశీలించారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, 1318, 1262 ధాన్యం రకాలను కొనుగోలు చేయటం లేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంకటాపురంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన మండల పార్టీల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, పార్టీ నాయకులు రావి నాగేశ్వరరావు, పెదప్రోలు సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు తదితరులు ఉన్నారు.

### పరిశ్రమల ఏర్పాటుకు కెనరా బ్యాంకు రుణాలు

**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వ్యాపారులకు రుణాలు ఇస్తామని కెనరా బ్యాంకు డీజీఎం జైస్వాల్ (బెంగుళూరు) అన్నారు. గ జిల్లా కోర్టుసెంటర్‌లోని కల్యాణ ఎంఎస్‌ఎంఈ కార్యక్రమంలో జైస్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రోల్డుగోల్డు పరిశ్రమకు క్లస్టర్లుగా ఏర్పడితే సబ్సిడీపై రుణాలు అందుతాయన్నారు. ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ అధ్యక్షుడు పి. వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కెనరా బ్యాంకు విజయవాడ సర్కిల్ డీజీఎం మంజునాథ్, విజయవాడ రీజనల్ ఆఫీసు ఏజీఎం ఆనంద్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రాపాక వెంకట్రావు, ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ కార్యదర్శి అంకెం జితేంద్ర తదితరులు మాట్లాడారు. పెద్ద సంఖ్యలో రోల్డుగోల్డు వ్యాపారులు పాల్గొన్నారు.

### భగవద్గీత పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** మహతి కళావేదికపై జిల్లా స్థాయిలో టీటీడీ, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత పోటీల బహుమతి ప్రదానోత్సవ సభ శుక్రవారం జరిగింది. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సీబీకే ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజేతలకు జిల్లా రిజిస్ట్రార్ జి.వి.ఎస్.ఆర్.కె.మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులందజేశారు. సంపూర్ణ భగవద్గీత పోటీల్లో ఎంఎస్ఆర్ మౌనిక. సీనియర్స్ విభాగంలో పి. సమర్థ, జె.మాధవి, కె. స్వాతి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. జూనియర్స్ విభాగంలో పి. నరసింహ, టి. వెంకటదత్త, సిహెచ్. రూపశ్రీ ప్రథమ, ద్వితీ య, తృతీయ, సీనియర్స్ విభాగంలో కె. జాగృతి, ఎన్. హనీషా, జి. నిహారిక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, హిందూ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కుటుంబరావు, కొడాలి సోమసుందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరలక్ష్మి, నాగలక్ష్మి, శ్రీకాంత్, శేషబాబు, ఇస్కాన్ ప్రతినిధి బృందావనదాస్ పాల్గొన్నారు.

### హంసలదీవి బీచ్ గేట్ వద్ద టోల్ వసూల్

**కోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న హంసలదీవి బీచ్ గేట్ వద్ద అటవీశాఖ అధికారులు టోల్ వసూలు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గురువారం బీచ్ ఎంట్రన్స్ గేటు వద్ద బోర్డుని ఏర్పాటు చేసి టోల్‌వసూల్ ప్రారంభించారు. పాలకాయితిప్ప కరకట్ట వద్ద నుంచి బీచ్ వరకు ఉన్న రహదారి ఇరుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించేందుకు అనుమతి నిరాకరిస్తున్న అటవీశాఖ అధికారులు పర్యాటకుల వద్ద మాత్రం టోల్ వసూలు చేయటం విడ్డూరంగా ఉందని పర్యాటకులు వాపోతున్నారు. వాహనాలకే కాక పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20లు వసూలు చేయటం గమనార్హం. ఈ విషయమై ఫారెస్ట్ రేంజర్ శ్రీసాయిని వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టోల్ వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

### ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు

**చల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** ప్రభుత్వ వైద్యశాలల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. చల్లపల్లిలోని కస్తూర్బా మెమోరియల్ ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. రూ.1.32 లక్షలతో కొనుగోలు చేసిన బ్లడ్ స్టోరేజీ గది ఏసీ మిషన్, రెండు కంప్యూటర్లు, ఒక కంప్యూటర్ టేబుల్, రెండు కంప్యూటర్ చైర్లను ఆయన అందజేశారు. వీల్‌చైర్‌ను ఆసుపత్రికి అందించారు. డాక్టర్ ఎస్‌ఎస్.శ్రీనివాసరావు, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈవో పివి.మాధవేంద్రరావు, డైరెక్టర్లు తోట కనకదుర్గ, వరదా హరిగోపాల్, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎంవి ఎన్‌వి.రామకృష్ణ, డాక్టర్ అవినాష్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### కోటేశ్వరరావు సేవలు అనిర్వచనీయం

**మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** పెదప్రోలులోని దేవాలయాల అభివృద్ధికి కూరపాటి వెంకట కోటేశ్వరరావు - ఉమాదేవి దంపతుల సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. చెన్నకేశవస్వామి ఆలయ అర్చకుని కుటుంబానికి అవసరమైన గృహాన్ని రూ.33 లక్షలతో నిర్మించి శుక్రవారం దేవదాయశాఖకు అప్పగించారు. ఎమ్మెల్యే బుద్దప్రసాద్ గృహాన్ని ప్రారంభించి అర్చకునికి అం కితం చేశారు. జిల్లా దేవదాయశాఖ అధికారి ఎన్.వి.సాంబశివరావు, మండల టీడీపీ అధ్యక్షుల నడకుదుటి జనార్ధనరావు, గ్రామసర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పూడషపు రత్నగోపాల్, పార్టీ నాయకులు రావి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా జగాజ్యోతి

**ఘంటసాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)** వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం జగాజ్యోతి కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. గ్రామ ప్రముఖులు గొర్రెపాటి సురేంద్ర - రజని దంపతులచే వేద పండితులు చావలి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. 6.15 నిముషాలకు జగాజ్యోతిని వెలిగించగా, భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, గొర్రెపాటి జగన్మోహనరావు పర్యవేక్షించారు.

### పాఠశాల స్థల సేకరణకు రూ.3.20 లక్షల విరాళం

**కోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** రామకృష్ణాపురం ఎంపీపీయూపీ పాఠశాలను జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలంటూ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు విద్యాశాఖకు విన్నవించారు. జడ్పీ పాఠశాల ఏర్పాటుకు స్థల సేకరణ అవసరం కాగా, పాఠశాల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా రూ.50 వేలను అడ్వాన్సుగా ఇచ్చి స్థల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పంచాయతీ పరిధిలోని ఇరాలి గ్రామస్థులు రూ.40 వేలు అందించారు. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలానికి చెందిన నడింపల్లి చిన వెంకటరాజు స్థల సేకరణకు తన వంతుగా రూ.3.20 లక్షలు అందించారు.

### పాలరైతులకు బోనస్ పంపిణీ

**చల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణామిల్క్ యూనియన్ రెండో విడత బోనస్‌ల పంపిణీ చల్లపల్లి పాలకేంద్రంలో శుక్రవారం జరిగింది. నాలుగు నెలల కాలానికి రూపాయికి పది పైసలు బోనస్ ప్రకటించిన సందర్భంగా చల్లపల్లిలో పాలకేంద్రంలోని పాడి రైతులు 153 మందికి రూ.1,56,390 బోనస్ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షురాలు బెల్లంకొండ లక్ష్మి, సూపర్‌వైజర్ తమ్మన సురేష్‌కుమార్, కార్యదర్శి గొరిపర్తి మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులు, పాల రైతులు పాల్గొన్నారు.

### మినుముకు బీమా చేయించుకోవాలి

**బంటుమిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** రైతులు మినప పంటకు బీమా చేయించుకోవల్సిందిగా ఏవో శివరామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల రైతులు ఈనెల 15వ తేదీ లోపు దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్, గ్రామ సచివాలయాల్లో ఎకరానికి రూ.85 చెల్లించి ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, కౌలుకార్డు, పంట ధ్రువపత్రం, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబరు తప్పనిసరిగా తీసుకుని వెళ్లాలన్నారు.



రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావును సన్మానిస్తున్న బుద్ధప్రసాద్, కొనకళ్ల, ఆనందబాబు, బొమ్మిడి నాయకర్

### బలహీన వర్గాలే రాష్ట్రానికి వెన్నెముక

● చిలకలపూడి పాపారావు అభినందన సభలో వక్తలు

**అవనిగడ్డ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** బలహీనవర్గాలే రాష్ట్రానికి వెన్నుముక అని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చిలకలపూడి పాపారావు అభినందన సభ శుక్రవారం అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ తదితరులు చిలకలపూడి పాపారావుకు గజమాలతో ఘనంగా సత్కరించారు. కడప జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొణిరెడ్డి శివచంద్రారెడ్డి, అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, ఖాదీ బోర్డు మాజీ చైర్మన్ చంద్ర మౌళి, జనసేన నేతలు బండి రామకృష్ణ, అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన జనసేన, తెలుగుదేశం, బీజేపీ ముఖ్య నేతలు, మత్స్యకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### దళారులను నమ్మొద్దు : ఏవో

**మోపిదేవి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** రైతు సేవా కేంద్రాలలో అన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని మండల వ్యవసాయ శాఖాధికారి కె.హెబ్సిబా రాణి తెలిపారు. రావివారిపాలెం, బోడగుంట, వెంకటాపురం గ్రామాల్లో పర్యటించి ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీపీటీ 5204, ఎంటీయూ 1262 వరి రకాలు ప్రభుత్వం కొనుగోలు చేయటం లేదని కొందరు రైతు లు అపోహ పడుతున్నారని, దళారులను నమ్మి మోసపోకుండా అందరూ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించుకోవాలని తెలియజేశారు.

### రుసుం వసూలు వేలంపాట 9న

**పెడన, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** ఈనెల 14 నుంచి 24 వరకు జరగనున్న పైడమ్మ జాతర సందర్భంగా ఉత్సవ ప్రాంగణం, గూడూరు రోడ్డుకు ఇరువైపులా స్టాల్స్ ఏర్పాటు చేసుకునే వారి నుంచి రుసుము వసూలు చేసుకునే హక్కుకు ఈనెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు మునిసిపల్ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు. పాట సమయంలో రూ. 50 వేల డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే వేలంలో పాల్గొనడానికి అర్హులని ఆయన స్పష్టం చేశారు.

### అంబేడ్కర్‌కు ప్రముఖుల ఘనివాళి

**అవనిగడ్డ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** వర్ధంతిని పురస్కరించుకుని నేరేళ్లపాలెం బస్టాప్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, యాసం చిట్టిబాబు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, రాజనాల వీర బాబు తదితరులు పాల్గొన్నారు. మాలమహానాడు జిల్లా నేత దేవా గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. బొంతునరేష్, లింగం అనిల్, బెజవాడ రవి, బొంతు ప్రకాష్, రణ ధీర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్పీకి వీర్నాల ఫౌండేషన్ ప్రతినిధుల ఆహ్వానం



**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** వీర్నాల ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేయాల్సిందిగా ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎస్పీ ఆర్.గంగాధరరావును కలిసి ఆహ్వానించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా 2025 జనవరి 12వ తేదీ ఉదయం జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాల వరకు నిర్వహించే రన్నింగ్ పోటీల ప్రారంభానికి రావాలని వీర్నాల ఫౌండేషన్ ప్రతినిధులు వీర్నాల పావని, భాను తేజ, రావి సుధీర్, చొప్పరపు సాయిదుర్గ కోరారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96, 104, 115 |
| చికెన్ విత్ స్కిన్ | 184 |
| చికెన్ స్కిన్‌లెస్ | 194 |

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.620

## పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలి : ఎమ్మెల్యే వెనిగండ్ల

**గుడివాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) :** పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. మీ కోసం-మీ వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావుతో కలిసి పట్టణంలోని టైలరింగ్ స్ట్రీట్, పోస్టాఫీసు రోడ్డు, ఎస్‌బీఐ పక్క రోడ్డు, ఏలూరురోడ్డు, బస్టాండ్ సెంటర్‌లలో పర్యటించారు. టైలరింగ్ స్ట్రీట్ వద్ద భారీగా చెత్త పేరుకుపోవడంతో అధికారులపై ఎమ్మెల్యే వెనిగండ్ల మండిపడ్డారు. ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాల పక్కనఅన్న క్యాంటీన్‌లో ఉదయం అల్పాహారాన్ని ఆయన పరిశీలించారు. టీడీపీ నాయకులు చేకూరి జగన్మోహనరావు, వెనిగండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల మేలుకే రెవెన్యూ సదస్సులు

### ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**గుడ్లవల్లేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** భూసమస్యల పరిష్కారం చేసి రైతులకు మేలు చేసేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులో నిర్వహిస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని చంద్రాల గ్రామంలో రెవెన్యూ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూ సమస్యలను పరిష్కారానికి ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు. స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ ఆర్డీవో బాల సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేకాధికారి చిరంజీవి, అడుసుమిల్లి రామ్మోహనరావు (చంద్రాల చిట్టిబాబు), చంద్రాల సర్పంచ్ అర్జునరావు, కొడాలి రామరాజు తదితరులు పాల్గొన్నారు. **నందివాడ :** పెదలింగాల గ్రామంలో రెవెన్యూ సదస్సును ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కూటమి ప్రభుత్వం ముందు చూపుతో రెవెన్యూ సభలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారి ఆర్.వెంకట్రావు, తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి, ఆర్ఐ గణేష్, మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, ఎంపీపీ చాట్రగడ్డ రవి, మురళీ, వీరభద్రరావు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** రైతుల సమస్యలు పరిష్కరించటానికే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. అల్లిదొడ్డి, కాశిపూడి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా గ్రామసభల్లో తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. **పెదపారుపూడి :** భూషణగుళ్ల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎన్.చిన్న నరసింహులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ రంగారావు, రీ సర్వే అధికారి సుందర్, మండల రీ సర్వేయర్ అధికారి రాంబాబు, భూషణగుళ్ల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పామర్రు :** రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ఎల్లకుర్రు గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం సర్పంచ్ మస్తాన్ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన ముఖ్యఅథితిగా విచ్చేసి మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ, రైతులు తమ భూసమస్యలను వివరించి పరిష్కారం పొందాలన్నారు. తహసీల్దార్ గూడపాటి రవికాంత్, సమగ్ర భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వేమూరి గంగాధరరావు, ఎంపీడీవో కె.జ్యోతి, ఏవో శివనాగరాణి తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అభివృద్ధి అధికారి, నోడల్ ఎస్ రాజేష్ కోరారు. యాకమూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామంలోని పేదలకు నివాస స్థలాలను ఊరికి నాలుగు కిలోమీటర్ల దూరంలో అనువుగాని ప్రదేశంలో ఇచ్చారని, ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అర్జీ అందించారు. తోట్లవల్లూరులో ఇళ్ల స్థలాలకు ఇచ్చిన రెండు ఎకరాల వ్యవసాయ భూములను వెనక్కు తీసుకుంటామని భూ యజమాని బి అనిల్‌కుమార్‌రెడ్డి అర్జీ అందించారు. తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, వీఆర్వో ఎండి అక్బర్ బాషా, కార్యదర్శి నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.



చంద్రాల గ్రామంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాము, రావి వెంకటేశ్వరరావు,ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

### తొలిరోజు స్పందన కరువు

**కూచిపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** మొవ్వ మండలంలో తొలిరోజైన శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి స్పందన కొరవడింది. మొవ్వలో నిర్వహించిన సదస్సులో కేవలం మూడు అర్జీలు మాత్రమే దాఖలయ్యాయి. ఆధార్ సీడింగ్, రైసు కార్డు, 22ఏ జాబితాలో పేర్లు తొలగించాలంటూ అర్జీలు అందించారు. సర్పంచ్ పూర్ణచంద్రరావు, తహసీల్దార్ కె.మస్తాన్, ఆర్ఐ విజయదుర్గ, మండల ప్రత్యేకాధికారి విజయవర్ధనరావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ జగన్మోహనరావు, సర్వేయర్ కిషోర్‌బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.



వల్లూరుపాలెం ధాన్యం రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

## రైతుకు నష్టం కలిగిస్తే చర్యలు

### ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

**తోట్లవల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నష్టం కలిగిస్తూ అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలుంటాయని, ఇప్పటికే దళారులపై కేసులు నమోదు చేయటం జరిగిందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. వల్లూరుపాలెంలో రైతుల వద్దకు శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే వచ్చి సమస్యలు తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని, మిల్లుల వద్ద దోపిడీ లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అధికారుల నిర్వాకం వల్ల బస్తా రూ1,550 చొప్పున ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వచ్చిందని రైతులు చెప్పారు. ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతు వల్లూరుపాలెం సమస్యను ఒక్కరైతు కూడా తనకు చెప్పలేదన్నారు. ఇక నుంచి ఎలాంటి ఇబ్బంది ఎదురు కాకుండా ధాన్యం కొనుగోలు చేయిస్తామని రైతులకు హామి ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

**పామర్రు :** ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. తేమ శాతం, తరుగు ప్రభుత్వ నిబంధనల మేరకే చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వల్లూరిపల్లి గణేష్, మాచవరపు ఆదినారాయణ, దాలిపర్తి ప్రసాద్, పానుగంటి సందీప్, ఏవో పి.శిరీషా, గుంప గంగాధర్, శ్రీకాంత్, అజయ్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యావసర కిట్ల పంపిణీ

**తోట్లవల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామినేని కుటుంబయ్య శుక్రవారం తన పుట్టినరోజును పురస్కరించుకుని తోట్లవల్లూరు లయన్స్ క్లబ్‌లో 50 మంది నిరుపేదలకు బియ్యం, నిత్యావసర కిట్‌లను పంపిణీ చేశారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి చేతుల మీదుగా కిట్‌లను అందజేశారు. అన్నదానం నిర్వహించారు. సొంత గ్రామం కుమ్మమూరులో టీడీపీ కార్యకర్తలు, నాయకుల మధ్య కుటుంబయ్య పుట్టినరోజు వేడుకలను వైభవంగా జరిపారు. సర్పంచ్ మూడే శివశంకర్, టీడీపీ నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ

**గుడ్లవల్లేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు శుక్రవారం అన్నదానం చేశారు. దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామ పంచాయితీ విశ్రాంత ఉద్యోగి కొడాలి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు బొమ్ములూరు పంచాయితీ కార్యదర్శి కొడాలి రామ్మోహన్ గుడ్లవల్లేరు నీలకంఠేశ్వరపురం, పెంజంద్ర గ్రామాలకు చెందిన నిరుపేద వృద్ధులకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా లయన్స్ కో-ఆర్డినేటరు ఎన్.వి.వి.ఎస్.ప్రసాద్, జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై.పి.సి ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు శశికళ, కొడాలి రామ్మోహన్, జంగం మోహనరావు, దేవిశెట్టి రామకృష్ణ, సూరపనేని పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో 90 మందికి నియామకపత్రాలు

**కూచిపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలోవివిధ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 90 మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. పానాసోనిక్, ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్, పారాన బీపీవో సర్వీస్, ఇస్పాన్ ఎక్స్‌పీరియెన్సెస్ తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డాక్టర్ మాధవి, జేకేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరమ్మ, కె.ఆర్.మంజుల, జి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### గుడివాడలో 15 మందికి ఉద్యోగాలు




**గుడివాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) :** జాబ్‌మేళాలో 15 మంది ఉద్యోగాలు పొందినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ నరేష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, కురాకు ఫైనాన్షియల్ సర్వీస్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూకు 38 మంది హాజరుకాగా, వీరిలో 15మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగ నియామకపత్రాలను డాక్టర్ నరేష్‌కుమార్, ఎల్.గౌరీమణి అందజేశారు.



## అలరించిన కళాఉత్సవ్-2024

**గుడ్లవల్లేరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) :** అంగలూరు డైట్ కళాశాల వేదికగా శుక్రవారం నిర్వహించి కళాఉత్సవ్-2024 అలరించింది. విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. గాత్ర సంగీతం, వాయిద్య పోటీలు, నృత్య ప్రదర్శన, విజువల్ ఆర్ట్, స్టోరీ టెల్లింగ్ విభాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులందజేశారు. డైట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, పి.వినయ్ కుమార్, పి.లలితమోహన్, శ్రీనివాసాచార్యులు, శ్రీహరి కిరణ్ పర్యవేక్షించారు. కో-ఆర్డినేటర్ ఎస్.జయశ్రీ, టి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**గుడివాడ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** పర్నాస వల్లీదేవసేన సమేత నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దివ్య లీలా కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించటానికి సకల ఏర్పాట్లు చేసినట్లు భక్తబృందం తెలిపింది. స్వామి వారి కల్యాణం నిర్వహణకు, భక్తులకు సౌకర్యాల కల్పనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.



ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న అరిపిరాల డ్వాక్రా మహిళలు

## డ్వాక్రా మహిళల ధర్నా

**నందివాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** రూ.12 లక్షల మేర అవకతవకలకు పాల్పడిన అరిపిరాల డ్వాక్రా సంఘాల వీవోపై చర్యలు తీసుకుని తమ డబ్బు తమకు ఇప్పించాలని కోరుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు నందివాడ వెలుగుపథకం కార్యాలయం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏపీఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంగమ్మ, నాగరత్నం మాట్లాడుతూ గ్రూపు లీడర్లు లక్షల్లో మోసాలు చేస్తుంటే అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్త చేశారు. కలెక్టర్ స్పందించి డ్వాక్రా సంఘాలలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, డబ్బులు గోల్‌మాల్ చేసిన వ్యక్తుల నుంచి తమ డబ్బు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఏపీఎం వసంతరావును వివరణ కోరగా, తాను వచ్చి నెలఅయిందని, గతంలో ఏమి జరిగిందీ తనకు తెలియదన్నారు.



గుడివాడలో నివాళ్ళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి తదితరులు



పామర్రులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

## అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

### అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు, అధికారుల నివాళి

**గుడివాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాంగ నిర్మాత, భారత రత్న అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరిం చుకుని శుక్రవారం ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు ఆయన చిత్ర పటానికి నివాళ్ళులర్పించారు. జనసేన నియోజకవర్గ కార్యాలయంలో జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళ్ళులర్పించారు. అంబేడ్కర్ భవన్‌లో పొంగులేటి జయరాజు ఆధ్వర్యంలో ఎన్‌జీవోస్ గుడివాడ తాలుకా యూనిట్ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్ తదిత రులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళ్ళులర్పించారు. కోతి బొమ్మ సెంటర్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళ్ళులర్పించారు. ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్మంలో అంబేడ్కర్ చిత్రాపటానికి డిపో మేనేజర్ రాజేష్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. **గుడివాడ రూరల్ :** బొమ్ములూరు గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షులు వాసే మురళీ ఆధ్వర్యంలో అంబ్కేడ్కర్‌కు నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం అందరూ కలసి కృషి చేయాలని కోరారు. బిళ్లపాడు, మోటూరు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. **పామర్రు :** నాలుగు రోడ్ల సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కుమార్‌రాజా, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ నివాళులర్పించారు. మంతెన రామాంజనేయులు, చాట్ల రమేష్, దాలిపర్తి ప్రసాద్, మాచవరపు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. **నందివాడ :** తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, ఎంపీడీవో మల్లేశ్వరి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈవోపిఆర్‌డి భాషా, ఆర్ఐ గణేష్, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. **కూచిపూడి :** అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పామర్రు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ మొవ్వ మోహనరావు పేర్కొన్నారు. కూచిపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిట్టు శ్రీనివాసరావు, కాగిత సోమేశ్వరరావు, కైలా నాగభూషణం పాల్గొన్నారు. మొవ్వ విఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో డాక్టర్ ఎం.సుందరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాధవి, సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, తహసీల్దార్ మస్తాన్, పూర్ణచంద్రరావు, మండవ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## బలహీన వర్గాలే రాష్ట్రానికి వెన్నెముక

**అవనిగడ్డ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** బలహీనవర్గాలే రాష్ట్రానికి వెన్నుముక అని వక్తలు పేర్కొన్నారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చిలకలపూడి పాపారావు అభినందన సభ శుక్రవారం అవనిగడ్డ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ తదితరులు చిలకలపూడి పాపారావుకు గజమాలతో ఘనంగా సత్కరించారు. కడప జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొణిరెడ్డి శివచంద్రారెడ్డి, అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, ఖాదీ బోర్డు మాజీ చైర్మన్ చంద్ర మౌళి, జనసేన నేతలు బండి రామకృష్ణ, అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన జనసేన, తెలుగుదేశం, బీజేపీ ముఖ్య నేతలు, మత్స్యకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

● చిలకలపూడి పాపారావు అభినందన సభలో వక్తలు



రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావును సన్మానిస్తున్న బుద్ధప్రసాద్, కొనకళ్ల, ఆనందబాబు, బొమ్మిడి నాయకర్

### భగవద్గీత పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

**మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :** మహతి కళావేదికపై జిల్లా స్థాయిలో టీటీడీ, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత పోటీల బహుమతి ప్రదానోత్సవ సభ శుక్రవారం జరిగింది. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సీటీకే ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజేతలకు జిల్లా రిజిస్ట్రార్ జి.వి.ఎస్.ఆర్.కె.మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులందజేశారు. సంపూర్ణ భగవద్గీత పోటీల్లో ఎంఎస్ఆర్ మౌనిక. సీనియర్స్ విభాగంలో పి. సమర్ధ, జె.మాధవి, కె. స్వాతి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. జూనియర్స్ విభాగంలో పి. నరసింహ, టి. వెంకటదత్త, సిహెచ్. రూపశ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ, సీనియర్స్ విభాగంలో కె. జాగృతి, ఎన్. హనీషా, జి. నిహారిక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, హిందూ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కుటుంబరావు, కొడాలి సోమసుందర్ విజేతలకు బహుమతులు అందజేశారు. వరలక్ష్మి, నాగలక్ష్మి, శ్రీకాంత్, శేషుబాబు, ఇస్కాన్ ప్రతినిధి బృందావనదాస్ పాల్గొన్నారు.

### హంసలదీవి బీచ్ గేట్ వద్ద టోల్ వసూల్

**కోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):** పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న హంసలదీవి బీచ్ గేట్ వద్ద అటవీశాఖ అధికారులు టోల్ వసూలు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గురువారం బీచ్ ఎంట్రన్స్ గేటు వద్ద బోర్డుని ఏర్పాటు చేసి టోల్‌వసూల్ ప్రారంభించారు. పాలకాయితిప్ప కరకట్ట వద్ద నుంచి బీచ్ వరకు ఉన్న రహదారి ఇరుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించేందుకు అనుమతి నిరాకరిస్తున్న అటవీశాఖ అధికారులు పర్యాటకుల వద్ద మాత్రం టోల్ వసూలు చేయటం విడ్డూరంగా ఉందని పర్యాటకులు వాపోతున్నారు. వాహనాలకే కాక పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20లు వసూలు చేయటం గమనార్హం. ఈ విషయమై ఫారెస్ట్ రేంజర్ శ్రీసాయిని వివరణ కోరగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టోల్ వసూలు చేస్తున్నట్లు తెలిపారు.